ప్రజాశక్తి
సోపతి
జనవరి 25, 2015 ఆదివారం అనుబంధం

నల్లజాతి మహిళల కంఠస్వరం



ఆరోగ్యానికి కీలకం
కాలేయం

- బి.పి. కరుణాకర్ కథ: మలి మిగులు
- తెలంగాణ సాహిత్య విమర్శ, పరామర్శ
- 'చార్లెస్ డార్విన్' పై సమీక్ష
- దేవరాజు మహారాజు, సిహెచ్. మధు కవితలు

ఆ రెండు పాటలు మధురాతి మధురం

ఏళ్ళు గడుస్తున్న కొద్దీ కొన్ని పాటలు అజరామరంగా నిలిచిపోతాయి. ప్రతితరం శ్రోతల్ని అలరిస్తాయి. అలాంటి గొప్ప పాటలెన్నో పాడారు గీతాదత్ (23 నవంబర్ 1930–20 జూలై 1972). పన్నెండేళ్ళ వయసు నుంచే తన గాన మాధుర్యంతో లక్షలాది మంది శ్రోతలకు ఆనందానుభూతుల్ని పంచారు. గురుదత్‌తో వివాహం తర్వాత బాలీవుడ్‌లో ఎన్నో గొప్ప చిత్రాలకు తన గాత్రంతో ఔన్నత్యాన్ని చేకూర్చారు. హిందీ చిత్రాల్లో దాదాపు 1200 పాటలు పాడారు. అలాగే మరాఠీ, బెంగాలీ, మైథిలీ, భోజ్‌పూరి, పంజాబీ భాషల్లో ఆమె పాడిన పాటలు అనేకం. అయితే గురుదత్ మరో ప్రేమ వలయంలో చిక్కుపడటం, ఆ తర్వాత ఆత్మహత్య చేసుకోవటంతో ఆమె జీవితం ఒడిదుడుకులకు లోనయింది. నిరాశా నిస్పృహలకు లోనయి అనారోగ్యం బారిన పడింది. అలాంటి దశలో కూడా ఆమె కంఠంలోని ముగ్ధత్వం చెక్కుచెదరలేదు. ఆమె స్వరంలోని హొయలు శ్రోతను తెలియని ఆకర్షణకు లోను చేస్తాయి. అలాంటి రెండు గీతాలు ఆమె చివరిదశలో పాడారు. హిందీలో బాసు భట్టాచార్య నిర్మించిన 'అనుభవ్' సినిమా కోసం పాడిన పాటలవి. ఈ చిత్రంలో సంజీవ్‌కుమార్, తనూజ నటించారు. లలిత లలితమైన ఆమె స్వరంలోని మాధుర్యం శ్రోతల్ని ఓ వివశత్వానికి లోను చేస్తుంది. ఆ రెండు పాటలు విన్నకొద్దీ వినాలనిపిస్తుంది. ఆ పాటల చిత్రీకరణలోనూ సున్నితత్వం, భావుకత, సొగసుదనం వున్నాయి. ఆమె కంఠంలోని యవ్వనభరిత సౌందర్యం మోహపరవశానికి లోను చేస్తుంది. యూట్యూబ్‌లో ఈ పాటలు వినే వీలుంది. ఆసక్తి, అభిరుచి వున్న వారు ఈ పాటలు వినితీరాలి.

నాటక ప్రదర్శనల్లో నందితాదాస్

ప్రతిభా సంపత్తులున్న ఉదాత్తమైన నటి నందితాదాస్ ఇటీవలి కాలంలో నాటక ప్రదర్శనలకు ప్రాధాన్యమిస్తున్నారు. 'బిట్వీన్ ది లైన్స్' అనే నాటకాన్ని గతనెలలో బెంగళూరులో ప్రదర్శించారు. అంతకుముందు నవంబర్‌లో న్యూయార్క్‌లో కూడా ఈ నాటకాన్ని ప్రదర్శించారు. నందితాదాస్, ఆమె భర్త సుబోధ్ మస్కర్ 2010లోనే థియేటర్ ప్రొడక్షన్ కంపెనీ స్థాపించారు. ఈవిధంగా తన భార్య సృజనాత్మక ప్రతిభాపాటవ ప్రదర్శనలకు చేయూత నిస్తున్నారు సుబోధ్. ఆధునిక జీవితంలోని సంక్లిష్టతల్ని ఇతివృత్తంగా తీసుకొని నందితాదాస్, దివ్యజగ్గలే రూపొందించిన 'బిట్వీన్ ది లైన్స్' నాటక ప్రదర్శనలకు మంచి ఆదరణ లభిస్తోంది. కేవలం సినిమాల్లో మాత్రమే నటించాలని పరిమితులు విధించుకోలేదు నందిత. తన కెరీర్‌లో అత్యుత్తమమైన సినిమాల్లో నటించిన ఆమె ఇప్పుడు రంగస్థలానికి కొత్త సొగసులు అందిస్తున్నారు. బిట్వీన్ ది లైన్స్ ఆంగ్ల నాటకంలో నందిత, ఆమె భర్త సుబోధ్ కలిసి నటించడం విశేషం. నాటకానికి అవసరమైన ఆధునిక హంగులతో ప్రదర్శనలు నిర్వహించడం వల్ల ప్రేక్షకుల్నించి మంచి ఆదరణ వస్తోంది. ఈ రోజు (25 జనవరి 2015) ఆదివారం గుజరాత్‌లోని వదోదరలో కూడా ఈ నాటక ప్రదర్శన వుంది. గత కొన్నిరోజులుగా బరోడాలోని నాటకరంగ అభిమానులు ఈ నాటక ప్రదర్శన కోసం ఎదురు చూస్తున్నారు. సినిమా గొప్పతనం సినిమాదే. నాటకం ప్రత్యేకత నాటకానిదే. ఆ ప్రత్యేకతను ఈతరం ప్రేక్షకులకు తెలియజేస్తున్నారు నందిత. నాటకంపై మక్కువను ఇనుమడింపజేసేలా అత్యాధునిక సెట్స్‌లో, సమకాలీన ఇతివృత్తంతో కళాత్మకమైన రీతిన ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. పరిపూర్ణత కోసం తపించే నటి నందిత. ఈ విషయం మరోసారి ఈ నాటక ప్రదర్శనల ద్వారా నిరూపిస్తున్నారు. నందిత, సుబోధ్‌ల థియేటర్ కంపెనీ వాణిజ్యపరంగా కూడా లాభదాయకంగా ఉండటం గమనార్హం.

■ అంతరంగం

సమర్థత

వర్గవైరుధ్యాలు ప్రబలిన సమాజంలో 'సమర్థత'కు ప్రమాణాలేమిటి? ఆ ప్రమాణాల్ని ఎవరు నిర్ధారిస్తారు? వారు నిర్ధారించే ప్రమాణాలకు మూలాలేమిటి? అన్నవి ప్రధానం. ఆర్థికవేత్తలు, ఇతరేతర రంగాలకు చెందిన నిపుణులు ఈ దేశానికి అత్యంత సమర్థవంతుడైన నేత దొరికాడని కితాబునిచ్చే ధోరణి ఈమధ్యన పెరిగింది. చారిత్రక స్పృహ, శాస్త్రీయ దృష్టి లేని మనిషి సమర్థుడయిన నాయకుడు ఎలా అవుతాడు? వినాయకుడికి ఏనుగు తొండం వుండటాన్ని ప్లాస్టిక్ సర్జరీ నైపుణ్యంగా అభివర్ణించిన నాయకుడి సామర్థ్యం ఏమిటో చెప్పకనే తెలియడం లేదా? మతమౌఢ్యం పెచ్చరిల్లుతుంటే నోరు విప్పని నేత సమర్థుడవుతాడా? పుక్కిటి పురాణాల్ని చరిత్రగా బోధించాలనుకునే అశాస్త్రీయ నైజం ఏ సమర్థతకీ, నైపుణ్యానికీ ప్రమాణాలు?

ఇలాంటి ప్రశ్నలు పారిశ్రామికవేత్తలు, వారికి తందానా తానా అనే ఆర్థికవేత్తలు, వాణిజ్యనిపుణులు సంధించరు. కానీ చదువుకునే తరం మౌనంగా ఉండలేదు. చరిత్రను అధ్యయనం చేసేవారు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చదువుకునేవారు, పనిచేసేవారు ఆలోచించడం అనివార్యం. ఈ అనివార్యతల్లోంచే ఎవరి సమర్థత ఏమిటో ఒక కంట కనిపెడతారు. కోట్లాదిమంది ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా సంపన్నుల ప్రయోజనాలకు గులాంగిరీ చేసే రీతి రివాజు 'సమర్థత' అన్న పదానికే అవమానకరం.

ఆత్మగౌరవం, ఆత్మస్థయిర్యం లేని నాయకుల పదాల గారడీ మభ్యపెట్టలేదు. నిజమైన విజ్ఞానం ప్రశ్నించడమే. ఆ ప్రశ్నలకు సరయిన జవాబులు చెప్పగలిగే ప్రావీణ్యమే సమర్థత. మభ్యపుచ్చడం లేదంటే దబాయించడం నైచ్యం. నైచ్యం సమర్థత కోవలోకి రాదు. అది ప్రతిభ కానే కాదు. వాస్తవాల్నించి తప్పించుకోడం. ఈ తప్పించుకునే వైఖరి ఎల్లకాలం కొనసాగదు. మేధావులు, కళాకారులు, సాహిత్యకారులు తమ సమర్థతను ప్రదర్శించే కాలం సమీపిస్తోంది.

ఏది ప్రతిభ, ఏది మౌఢ్యం, ఏది శాస్త్రీయత అన్నవి నిర్ధారించుకునే దృష్టివైశాల్యం తప్పనిసరి. దీనిని సంతరించుకోవాల్సిన పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డారు మనుషులు. ఈ క్రమాన నిజమైన సమర్థత, పోరాటపటిమ వెలికివస్తాయి. ఈ సమర్థత ముందు పాలక యంత్రం కుదేలవుతుంది. ఈ దిశగా స్పందించి వ్యవహరించడం సృజనశీలుర కర్తవ్యం. సకల సాహిత్య కళారంగాలు సమాయత్తం కావలసిన సందర్భం. తమ అసలుసిసలు నైపుణ్యాన్ని ప్రదర్శించడం అత్యవసరం. ప్రతి రచన, ప్రతి చిత్రం, ప్రతి ప్రదర్శన ఈరీతిన రూపుదిద్దుకోడం వర్తమాన చైతన్యం. ఆ చైతన్యంలోనే ప్రజల సమర్థతకు నిజమైన ఆవిష్కారం. విశాల ప్రజానీకం స్వప్నించే 'విజ్ఞాన భారతం' సాకారం కావడం సాధ్యం.

వెంటాడే వాక్యం

విద్యావంతులైన ప్రజలను నడిపించడం తేలిక, తోలడం కష్టం. పరిపాలించడం తేలిక, అణగదొక్కడం అసాధ్యం.

\- లార్డ్ బ్రూగమ్

ప్రజాశక్తి

సోపతి

జనవరి 25, 2015

లేఖలు	4
విభిన్న గిరిజన గూడేల్లో 'డేటింగ్'	5
కవర్‌స్టోరీ ఆరోగ్యానికి కీలకం కాలేయం	6
సృజన నల్లజాతి మహిళల కంఠస్వరం	10
సంగీతం విలక్షణ స్వర మాధుర్యం	11
కథ మలి మిగులు	12
సంగీతం మరపురాని మధురమైన బాణీలు	13
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
ప్రత్యేక వ్యాసం	
తెలంగాణ సాహిత్య విమర్శ: పరామర్శ	18
వికాసం ఓటమినీ స్వీకరించగలగాలి...!	20
జోక్స్ కార్నర్	21
సోర్స్‌కోడ్	
మీడియాలో సంచలనం... డ్రోన్ జర్నలిజం	22
క్యాన్సర్‌కు హోమియో వైద్యం	23
సమీక్షలు	
ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసే	
డార్విన్ జీవిత చరిత్ర	24
ఈ వారం కవిత్వం	
కామాటిపుర	26

"నా కాలేయం నవ్వుతోంది" అని ప్రతిఒక్కరు చెప్పగలిగినప్పుడే ఆరోగ్యంగా ఉన్నట్టు లెక్క. అందుకే ఆరోగ్యానికి ప్రధానమైన కాలేయం గురించిన విశ్లేషణాత్మకమైన ముఖచిత్ర కథనమిది.

లేఖలు



రవీంద్రశర్మ అందరికీ ఆదర్శం

ఈ వారం సోపతిలో కవర్ స్టోరీ 'హస్తకళల కేంద్రం రవీంద్రాశ్రమం' చదివిన తర్వాత ఆదిలాబాద్ జిల్లాలో కళాశ్రమాన్ని నడుపుతూ, గ్రామాలలో చేతి వృత్తులను, చారిత్రక వస్తుసముదాయాన్ని కాపాడుకోవాలన్న తపన వున్న వ్యక్తి రవీంద్రశర్మ మాత్రమే అనిపించింది. నిరుపయోగంగా వున్న వస్తువులను సేకరించి తన ఆశ్రమంలో జాగ్రత్తగా పొందుపరుస్తుండడం వారికే సాధ్యం. 63 సంవత్సరాల వయసుగల శర్మ ఆశ్రమ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటూ, అంతరించిపోతున్న వస్తువులను కాపాడుతున్నారు. చేతి వృత్తులను సైతం ఆదరిస్తూ తనదైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం. వేసవి సెలవుల్లో మా స్కూలు విద్యార్థులను తీసుకువెళ్ళి, వారి ఆశ్రమాన్ని సందర్శించాలనుకుంటున్నాను.

– కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్

ప్రభుత్వం గుర్తించాలి

బాధ్యతగల ప్రభుత్వ వ్యవస్థలు చేయాల్సిన పనులు ఓ వ్యక్తిగా రవీంద్రకళాశ్రమాన్ని అపురూపంగా తీర్చి దిద్దడం ఆశ్చర్యం కలిగించింది. అయితే ఇందులోనే ఓ ప్రముఖుడు తన అభిప్రాయం వెలిబుచ్చినట్లు ఈ పవిత్ర కార్యాన్ని సర్కారు భుజాన వేసుకుంటేనే సుమచితంగా వుంటుంది.

– వి.భవానీ శంకర్, సికింద్రాబాద్

ఇబ్బందుల్లోనూ ఆత్మస్థైర్యం

ఆదివారం సోపతిలో సీరియల్‌గా వస్తున్న ప్రేమ– విప్లవం బాగుంటోంది. గతవాతం కథనంలో రోజంతా చలిలో ప్రయాణం చేసి, మార్క్ దంపతులు పారిస్‌లో ఎదుర్కొన్న ఇబ్బందులు, పరిస్థితులను ఆస్వాదించిన తీరు, 'ఈ సామాన్యుని వసంత కాల గర్జన పారిస్‌కు మాత్రమే పరిమితం కాలేదు' పేరా నుంచి కొనసాగిన కథనం ఆద్యంతం ఆకట్టుకున్నది.

– సైదులు, మిర్యాలగూడ, నల్గొండ

దర్శకుడికి నివాళి

సంగీత ప్రియులు ఎంతగానో ఇష్టపడే చక్రి గురించి సోపతిలో ఇవ్వడం బాగుంది. చిన్న వయసులోనే ఆయన గుండెపోటుకు గురై మరణించడం బాధాకరం. కానీ ఆయన సినిమా పాటలకు చేకూర్చిన సంగీతం ఇప్పటికీ చెవుల్లో మోగుతున్నట్లే ఉంటుంది. అలాంటి ఒక మంచి సంగీతకారునికి సోపతిలో నివాళి శీర్షికన స్థానం కల్పించడం ఆయనకు నిజంగా నివాళి అర్పించినట్లయింది.

– శ్రావ్య, మెదక్

కవితలు బాగున్నాయి

సోపతిలో వచ్చిన 'చిగురించిన జీవిత వంతెన', 'మౌనం' కవితలు ఎంతో బాగున్నాయి. ఒక చెట్టు గురించి వర్ణిస్తూ జీవిత సత్యాన్ని చెప్పిన స్ఫూర్తి గారి కవిత ఆసక్తిగా ఉంది. మంచు తెరల మీదుగా మాటలు కరిగిపోతున్నాయంటూ ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ గారి కవిత మనస్సును హత్తుకుంది.

– సావన్, మల్కాజిగిరి, హైదరాబాద్

మన జాతీయాలు

కామారపు జీడి

జీడి అంటే అందరికీ తెలిసిందే. తెలంగాణ పల్లెలలో మోటువైద్యంలో ఈ జీడి ఉపయోగపడుతుంది. కీళ్ళ నొప్పులకు, ఎముకలు తొణికినప్పుడు ఆ నరాన్ని దొరకబట్టి జీడి పెడతారు. అది ఏమాత్రం వదలదు. ఇక కామారపు జీడి అయితే అంటుకుంటే వదలిపెట్టదు. దాని స్వభావమది. అది ఒక పట్టాన వదలదు. వదలిపెట్టకుండా బాధిస్తుంటే 'కామరపు జీడి'లా తగులుకున్నాడని అంటారు. ఒక పట్టాన విడవటం లేదని విసుక్కునే క్రమంలో ఈ జాతీయాన్ని ఉపయోగిస్తారు.

కంట పత్తి పెట్టుకొను

నిద్రాహారాలు మాని శ్రద్ధగా పనిచేయు; రాత్రాంతము దీపపు వెలుగులో పనిచేయు – కంట వత్తి పెట్టుకొనుట అంటే వత్తిని కంటిలో పెట్టుకొనుట కాదు. పత్తి నూనెలో వెలుగుతుంది. కన్ను కూడా తెరచి ఉంచితే వెలిగినట్టే లెక్క. కన్నులు తెరచివుంచుట అంటే నిద్రించకుండా పనిచేయడం. లేదా ఎదురుచూడటం. కొందరు మహిళలు భర్తలు వచ్చేవరకు మెలకువగానే ఉంటారు. భర్త రాక కోసం కంట పత్తిపెట్టుకొని ఉంటారు. వారేమాత్రం కునుకు తీయరు. "నీకోసం కంట పత్తి పెట్టుకొని చూశాను. నువ్వు తెల్లవారుజామున వచ్చావు" అని ఇల్లాలు అంటే, "ఏం చేయమంటావు? నా టేబిల్ మీద ఫైళ్ళు ఎక్కువగా ఉంటే రాత్రంతా కంట పత్తి పెట్టుకొని చూసి వస్తున్నాను" అనడంలో ఈ జాతీయం వాడకం వుంది.

పూచిన తంగేడు

తంగేడు మొక్క విపరీతంగా పూస్తుంది. ఆకులు కనిపించనంతగా పూస్తుంది. ఏడు వారాల నగలు ధరించి భోగభాగ్యాలతో తులతూగుతున్న వ్యక్తిని పూచిన తంగేడుతో పోలుస్తారు. దోసతోటా, తామర తంపరా విస్తరణకు, వ్యాప్తికి గుర్తులయితే పూచిన తంగేడు అంటారు. దోసతోట, తామర తంపరా వంశాభివృద్ధిని ప్రకటిస్తే ఈ పూచిన తంగేడు అనే జాతీయం ఐశ్వర్యాన్ని తెలియజేస్తుంది. అందుకే ప్రవరాఖ్యుడిని అల్లసాని పెద్దన "కెలకులనున్న తంగేటి జున్ను" అన్నాడు. తంగేటి పాతిన తంగేటి జున్నంటారు. ప్రాణదాతగా, ధాన్యదాతగా విలసిల్లునతడు తంగేటి జున్ను– విపరీతంగా అలంకరించుకొనే వ్యక్తులనూ పూచిన తంగేడంటారు.

– యం.వి.నరసింహారెడ్డి

సహజీవనం పెళ్లిగా మారేదెప్పుడు?

'డేటింగ్'..అంటే ఆడామగా కొంతకాలం సహజీవనం చేయడమేకదా? అవును మీరనుకుంటోంది నిజమే. ఎక్కడో పాశ్చాత్య దేశాల సంస్కృతి ఇప్పుడిప్పుడే మన దేశంలోని మహానగరాల్లో చొరబడుతోంది. అలాంటిది కొండకోనల నడుమ బతుకు జీవుడా! అంటూ రోజులు వెళ్లదీసే గిరిజన గూడేల్లోకి అప్పుడే పాకిందా? అనే అనుమానం కల్గుతోంది కదూ. మీ అనుమానం నిజమే. కాని ఆదివాసీలకు అంత అదృష్టమా? పెళ్లిళ్లు చేయలేని, చేసుకోలేని నిస్సహాయ స్థితి వారిది.

అవి ఆదిలాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలు. అక్కడి గిరిజనులకు నాలుగు పదుల వయసు వచ్చినా పెళ్లి అయి ఉండదు. కానీ కొడుకులు, కూతుళ్లు ఉంటారు. ఇది ఆశ్చర్యమనిపించినా నిజం. ఆర్థిక స్థోమతలేక, పెళ్లి చేసుకోలేక సహజీవనం చేస్తున్న గిరిజనులు పిల్లలు కంటున్నారు. వారు పెళ్లి చేసుకోనిదే పిల్లలకు పెళ్లి చేయలేరు. దీంతో పిల్లలు బ్రహ్మచారులుగానే ఉండిపోతున్నారు. ఇది గిరిజన సాంప్రదాయం. దీంతో తమకు పెళ్లిళ్లు చేయించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

గిరిజనుల్లోని కొన్ని తెగల్లో పెళ్లి చేసుకోవాలంటే భాజాభజంత్రీలు, పుస్తె, మట్టెలు తప్పనిసరి. ఊరోళ్లకు భోజనాలు పెట్టాలి. ఇవి చేయకపోతే వారు పెళ్లి చేసుకోలేరు. దీంతో బెజ్జూర్ మండలంలోని సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడెం, నాగపెల్లి, గబ్బాయి, కమ్మరంగాం, మొర్లిగూడెం, జిల్లెడ తదితర గ్రామాల్లో ఆర్థిక స్థోమత లేక 30, 40 ఏళ్లుగా గిరిజనులు పెళ్లిళ్లు చేసుకోలేకపోతున్నారు. కానీ సహజీవనం చేస్తూ పిల్లలను కంటున్నారు. తల్లిదండ్రులు పెళ్లి చేసుకోలేకపోతే వారి పిల్లలకు పెళ్లిళ్లు చేయలేరు. ఇది వారి ఆచారం. దీంతో తాము పెళ్లిళ్లు చేసుకోలేక, పిల్లలకు పెళ్లిళ్లు చేయలేక గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. తినడానికే సరిగా తిండి దొరకడం లేదని, ఇంకా భాజాభజంత్రీలు, ఊరోళ్లకు భోజనం పెట్టి పెళ్లి ఎలా చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా అవి తమ దరికి చేరడం లేదని వాపోతున్నారు. గతంలో వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేద జంటలకు పెళ్లిళ్లు చేయించారని, అప్పటి నుంచి సామూహిక వివాహాల ఊసే మరిచిపోయారని చెబుతున్నారు. ప్రభుత్వం గ్రామగ్రామాన సర్వే చేయించి పేద గిరిజనులకు పెళ్లిళ్లు చేయించాలని కోరుతున్నారు.

– రాపర్తి దత్తాత్రి, 9490099400

13 ఏళ్లయింది..

'13 ఏళ్లుగా కలిసుంటున్నాం. మాకు ఐదుగురు సంతానం. పిల్లలు పెద్దోళ్లవుతున్నరు. వాళ్లకు తోడుకావాలె. కాని మాకే పెళ్లి కాలేదు. వాళ్లకెలా పెళ్లి చేసేది. పెళ్లి చేసుకోవాలంటే కొన్ని డబ్బులు కావాలె. తినడానికే దిక్కులేదు. ఇంకా పెళ్లి ఎలా చేసుకోవాలి. సర్కారు కనికరించి మా అసుంటోళ్లకు పెళ్లిళ్లు చేస్తే బాగుంటది.

– గొర్రెం దేవాజీ – పద్మ దంపతులు, దత్తాయి గ్రామం

పిల్లలకు ఎలా పెళ్లి చేయాలె?

'22 ఏళ్లుగా కలిసుంటున్నం. పెళ్లి చేసుకోవడానికి పైసల్లేక ఇలాగే ఉంటున్నం. కానీ మా పిల్లలకు పెళ్లి చేయాలంటే ముందు మేం చేసుకోవాలి. ఏం చేయాలో అర్థమైతలేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. మాలాంటి వాళ్లు గిరిజన తండాల్లో చాలా మంది ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు చేస్తే మా పిల్లలకు పెళ్లిళ్లు చేయగలుగుతాం.'

– గొర్రెం రంగయ్య – లక్ష్మి దంపతులు

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయొచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహా పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా: మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–20

కాలేయం

ఈ దేశంలో ప్రతి అయిదుగురిలో ఒకరికి కాలేయవ్యాధి వుందని గణాంకాలు చెబుతున్నాయి. ఆధునిక జీవనశైలిలో మనిషి తన సహజాతాలు కోల్పోయాడు. బతకడం కోసం తినడం ఒకప్పటి మాట. తినడం కోసమే బతకడం అన్నది ఇప్పటి రివాజు అయింది. దీంతో ఆకలి వున్నా లేకున్నా ఏది పడితే అది, ఎక్కడ పడితే అక్కడ అతిగా తినడం ఒక వ్యసనమైంది. మద్యపానం వినోదమైంది. ప్రతి సంఘటనకీ, సందర్భానికీ తాగితూలడమే ఎంజాయ్‌మెంట్ అనే ధోరణి విపరీతమైంది. అపసవ్యమైన అలవాట్ల కారణంగా ఆరోగ్యానికి కీలకమైన కాలేయం రోగగ్రస్తమవుతోంది. నివారించడానికి వీల్లేని స్థితిలో కాలేయ వ్యాధుల బారిన పడుతున్నారు మనుషులు. మరీ నగరాల్లో, పట్టణాల్లో ఈరకమైన వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. అయిదుగురిలో ఒకరికి కాలేయ వ్యాధి వుందంటే దేశంలో దాదాపు ఇరవై కోట్లమంది కాలేయ వ్యాధి పీడితులుగానే భావించాలి. నగరాల్లో కార్పోరేట్ ఆస్పత్రుల్లో కాలేయ విభాగాలు, కాలేయమార్పిడి శస్త్రచికిత్సలు సాధారణమయ్యాయి. రోడ్ల పక్కన అమ్మే తినుబండారాలు, గప్‌చుప్‌లు, టీలు, కాఫీలు, బిస్కెట్లు, ఐస్‌క్రీమ్‌లు, నిల్వ వుంచిన రకరకాల బేకరీ ఫుడ్, మాంసం, మద్యం, బర్గర్లు, పిజ్జాలు పగలు రేయి అనకుండా లాగించేస్తున్నారు. వీటిని స్వీకరించిన కాలేయం (లివర్) ఎంత ఒత్తిడికి లోనవుతుందో అవగాహన లేని దుస్థితిలో చాలామంది వున్నారు. భారతీయుల్లో ఇతర వ్యాధుల పట్ల ఉన్న స్పృహ, చైతన్యం కాలేయవ్యాధుల పట్ల లేనందునే రోజురోజుకీ వ్యాధిబాధితుల సంఖ్య పెరుగుతోంది. కనుక కాలేయం మీద అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవరుచుకోవడం అవశ్యం. ఈ అంశాలకు సంబంధించిన కథనమిది.

'లివర్ స్మయిల్స్' అంటుంది జూలియా రాబర్ట్స్ 'ఈట్ ప్రే లవ్' చిత్రంలో. అంటే 'కాలేయం నవ్వుతుంది' అని అర్థం. అది ఆమె లోలోపలి ఆనందానికి ప్రతీక. ఎంత ఆరోగ్యంగా, హాయిగా ఉంటే ఆ మాట అనగలరు. అలాంటి కాలేయం వున్నవారు అదృష్టవంతులు. వారే సంపూర్ణ ఆరోగ్యవంతులు. వారిని కాలేయంపై స్పష్టమైన అవగాహన ఉన్నవారిగా పరిగణించాలి.

మానవ శరీరంలో చర్మం తర్వాత అతి పెద్ద అవయవం కాలేయం. ఇది చేసే పనులు అనేకం. 1.4 నుంచి 1.6 కిలోగ్రాముల బరువు వుండే కాలేయం నుంచి 60 నుంచి 80 శాతం రక్తం ప్రవహిస్తుంది. కాలేయాన్ని దాదాపుగా 1,00,000 చిన్నచిన్న భాగాలుగా విభాగించవచ్చు. కాలేయంలో అరవై శాతం హిపోసైట్లనే కణాలుంటాయి. ఇవి న్యూట్రియెంట్లను పీల్చుకుంటాయి. శరీరానికి హాని కలిగించే విష పదార్థాలను విడగొట్టి ప్రమాదరహితంగా చేయడంలో వీటి పని కీలకమైంది.

పనులు అనేకం

ఊపిరితిత్తుల కింద ఉండే కాలేయం గోధుమ రంగులో ఉంటుంది. కాలేయం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. కాలేయం చేసే పనులు అనేకం. మనిషిని అనేకరోగాల బారినుండి కాపాడే 'యాంటీబాడీ'లను కాలేయం తయారు చేస్తుంది. సాధారణంగా రోజూ మనం తినే నూనె పదార్థాలు, స్వీట్లు, మసాలాల వల్ల ప్రేవులు ఉత్పత్తి చేసే 'అమినో ఆసిడ్లు' అలాగే రక్తంలో కలిసే సైనైడ్ కన్నా విషపూరితం అవుతాయి. అలా కాకుండా అమినో ఆసిడ్లను ప్రొటీన్లుగా మార్చడంలో ముఖ్యమైన పాత్ర కాలేయానిది. మనం తీసుకున్న ఆహారంలోని విషం నుంచి మనల్ని రక్షించడంలో కాలేయానిది అతి పెద్ద విధి. ఎక్కువగా ఉన్న ప్రొటీన్లను మూత్రపిండాలకు పంపి, మూత్రరూపంలో విసర్జింపజేస్తుంది.

మన శరీరం ఒక్కొక్కసారి అనవసరమైన ఉప్పును దాచుకుంటే, అలా ఎక్కువగా ఉండే ఉప్పును కరిగించేస్తుంది కాలేయం. అలాగే గుండెలోకి రక్తం పెద్దఎత్తున చేరితే గుండె పెరగకుండా ఆ రక్తాన్ని స్పాంజిలాగా పీల్చుకుని, గుండె శక్తిని బట్టి కొంచెం కొంచెం విడుదల చేస్తుంది. మనం తీసుకునే పానీయాలు శుభ్రపడకుండా రక్తంలో చేరితే చాలా ప్రమాదం. కనుక రక్తంలో కలిసిన ఆ పదార్థాలు కాలేయం గుండా ప్రవహించిన ఆరు సెకన్లలో, వాటిలోని విషపదార్థాల తీవ్రతను తగ్గించివేస్తుంది. రకరకాల పనుల్లో మనం కష్టపడే సమయాన కండరాలు గ్లూకోజ్‌ని ఉపయోగిస్తాయి. అప్పుడు 'లాక్టిక్ ఆసిడ్' ఉత్పత్తవుతుంది. దానిని గ్లైకోజన్‌గా మారుస్తుంది కాలేయం. మరల అవసరమైనప్పుడు దానిని గ్లూకోజ్‌గా మార్చి ఉపయోగించే వీలుంది. ఈ పనులు నిర్వహించడంలో కాలేయం పాత్ర ఎంతో ముఖ్యమైంది.

పైత్యరస ఉత్పత్తి

కాలేయం చేసే పనులన్నిటిలో కెల్లా అత్యంత ప్రాధాన్యం గల పని పైత్యరసం ఉత్పత్తి చేయడం. నశించిన రక్తకణాల నుంచి ఇనుమును వేరు చేసి, దాన్తో వాటిల్లోంచే పైత్యరసాన్ని తయారు చేయడం కాలేయం నిర్వహించే ముఖ్యమైన విధి. ఈ పైత్యరసం కాలేయం నుంచి నాళాల ద్వారా 'హెపాటైటిక్ నాళం'లోకి చేరుతుంది. ఈ నాళం ద్వారా 'పిత్తాశయం' (గాల్ బ్లాడర్)లోకి చేరుతుంది. పిత్తాశయం నుంచి మరిన్ని నాళాల ద్వారా చిన్నప్రేవు ముందుభాగం 'ఆంత్రమూలం' లేక 'ప్రథమాంత్రము' అనే 'డ్యూయెడినమ్'కు

చేరుతుంది. అయితే కాలేయం తయారు చేసిన పైత్యరసంలో సగం మాత్రమే డ్యూయెడినమ్ చేరుతుంది. మిగతా సగం పిత్తాశయంలోనే వుండిపోతుంది. ఆహారం తినగానే ఈ పిత్తరసం విడుదలవుతుంది. చిన్నప్రేవుకు చేరుతుంది. కొవ్వు పదార్థాల్ని వేరు చేసి శరీరంలో సులభంగా దాచే ఏర్పాటు చేస్తుంది. చిన్నప్రేవు తన పని పూర్తి చేసిన తర్వాత మిగిలిపోయిన వ్యర్థపదార్థాలను ఈ పైత్యరసం శుభ్రంగా ఊడ్చివేస్తుంది. ఈ క్రమాన దానిని మలాశయంలోకి త్రోసివేస్తుంది.

ఈవిధంగా అనేక విధుల్ని నిర్వహించే పైత్యరసానికి మూలంగా నిలిచిన కాలేయం పనిలో తేడా వస్తే మాత్రం మొత్తం వ్యవస్థ అస్తవ్యస్థమైపోతుంది. అందుకే కాలేయాన్ని జాగ్రత్తగా కాపాడుకోవలసిన అవసరముంది.

సాధారణంగా వైద్యులు మలమూత్రాల ప్రక్రియల సాఫీగా జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకుంటారు. ఎందుకంటే కాలేయం పనిని బట్టి మనిషి వివిధరకాల అస్వస్థతలకు లోనయ్యే అవకాశముంది. ఈ విసర్జన క్రియ సరిగా లేనప్పుడు వచ్చే జబ్బులు అనేకం. అందువల్ల కాలేయం పనితీరులో అపసవ్యతలు రాకుండా చూసుకోవాలి.

శక్తి అపారం

మామూలుగా దేహంలో ఏదైనా భాగానికి సంబంధించిన 'టిష్యూలు' దెబ్బతింటే ఆ లోటును పూరించుకోగల శక్తి గల అంగాలు బహుతక్కువ. అటువంటి అరుదైన పునరుత్పత్తి శక్తి చర్మం తర్వాత కాలేయానికి మాత్రమే వుంది. పాతికశాతం కాలేయం, అవసరమైతే మిగతా కాలేయాన్ని తిరిగి తయారు చేసుకోగలదు. అంతటి శక్తి కాలేయానికి వుంది. అందుకని కాలేయం పనివ్యవస్థ పూర్తిగా దెబ్బతినకముందే జాగ్రత్తపడాలి.

పిండం తల్లి గర్భంలో వున్నప్పుడే దేహానికి అవసరమైన రక్తకణాలు కాలేయంలోనే తయారవుతాయి. శిశువు పుట్టే సమయానికి ఎముకల గుజ్జు ఈ పని మొదలెడుతుంది. అంటే కణాల ఉత్పత్తి కాలేయానికి ఆదిలోనే మొదలవుతుందన్నది గమనార్హం. హెపాటోసైట్ కణాలు 'స్టెమ్‌సెల్స్' మాదిరిగా పని చేయగలగడం వల్లనే కాలేయం ఇలాంటి పునరుత్పత్తి శక్తిని సంతరించుకుంది. ఒక హెపాటోసైట్ కణం రెండు కణాలుగా వేరవుతుంది. అలా స్వయంగా విభజితం కావటం వల్ల నశించిన కణాల లోటును కాలేయం భర్తీ చేస్తుంది. అంతేగాక 'ఓవాలోసైట్లు' అనే కణాలు కూడా హెపాటోసైట్లుగా కానీ, పిత్తనాళాలలో ఉండే 'కోలాంజియో సైట్లు'గా కానీ విభజన చెందుతాయి. నాశనమైన కణాలను పునరుత్పత్తి చేసుకుంటూ దేహాన్ని కాపాడటంలో కాలేయం నిర్వహించే పాత్ర అమోఘమైంది. ఇతరేతర అనేకానేక విధులు నిర్వహిస్తూనే మనిషి శరీరంలోని పలుభాగాలు దెబ్బతినకుండా కాపాడుతుంది కాలేయం. కనుక ఇలాంటి కీలకమైన కాలేయం దెబ్బతినకుండా చూడటం మనిషి ఆరోగ్యానికి కీలకం. నిజానికి చాలా వాటిని భరిస్తూనే నిరంతరం పని చేసేలా కాలేయం నిర్మాణం రూపొందింది. అయినప్పటికీ విచక్షణారాహిత్యంతో వ్యవహరిస్తే తన పని తాను చేయడం కాలేయానికి సాధ్యం కాదు. అందువల్లనే ఇటీవలి సంవత్సరాల్లో కాలేయవ్యాధులకు లోనవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది.

లక్షణాలు త్వరగా బయటపడవు

కిడ్నీ జబ్బుల్ని గుర్తించగలిగి, జాగ్రత్తగా వుండాలన్న చైతన్యం కాలేయ వ్యాధుల పట్ల లేదని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. కాలేయాన్ని ఆరోగ్యంగా వుంచుకోవాలన్న స్పృహ లేదని వారు అంటున్నారు. ముంబయిలో ఏటా దాదాపు రెండు వేల మంది కాలేయ వ్యాధుల కారణంగా మరణిస్తున్నారు. మారిన జీవనశైలి, విచ్చలవిడితనంతో కూడిన ఆహారపుటలవాట్ల కారణంగా కాలేయవ్యాధుల పాలయ్యే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ దేశంలో ప్రతి అయిదుగురిలో ఒకరు కాలేయ వ్యాధుల బారిన పడుతున్నారని ఒక సర్వే తెలియజేసింది. పరిస్థితిలో మార్పు లేకపోతే 2025 నాటికి 'భారతదేశం కాలేయవ్యాధుల రాజధాని'గా మారే ప్రమాదముందని ముంబయికి చెందిన డాక్టర్ అభిదీప్ చౌధురి హెచ్చరిస్తున్నారు.

ప్రమాదం ముంచుకొచ్చే వరకు జాగ్రత్త పడకపోవటమనే చెడ్డ అలవాటు భారతీయుల్లో ఎక్కువ. అయితే కాలేయ వ్యాధులకు సంబంధించిన లక్షణాలు అంత త్వరగా బయటపడవు. కాలేయానికి సంబంధించి దాదాపు వందరకాల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. చాలామందికి తమకు కాలేయపరమైన జబ్బులున్నాయన్న స్పృహ కూడా ఉండదు. ఎందుకంటే వ్యాధి మరీ ముదిరిపోయే వరకు దానికి సంబంధించిన లక్షణాలు వెలికిరావు. కాలేయానికి పునరుత్పత్తి శక్తి అధికంగా ఉండటమే దీనికి కారణం. వైరస్‌ల వల్ల, దురలవాట్ల వల్ల కాలేయ కణాలు నాశనమౌతుంటే, ఆ కణాలు మళ్ళీ తయారువుతుంటాయి. దాంతో కాలేయానికి జరుగుతున్న నష్టం వెంటనే పైకి తెలియదు.

నాశనమయ్యే కణాల సంఖ్య పెరిగినా, కాలేయం వీలయినంతవరకు



పనులన్నీ సక్రమంగా, పూర్తిగా చేయాలని ప్రయత్నిస్తుంటుంది. అందుకని కాలేయం తీవ్రస్థాయిలో దెబ్బతినే వరకు ఎలాంటి నొప్పిగానీ, ఇబ్బంది గానీ వెంటనే తెలియదు. కొన్నిసార్లు వ్యాధి తీవ్రత తెలిశాక, కొంచెం జాగ్రత్తలు తీసుకుంటే మిగతా పనులు సరిగా నిర్వహిస్తుంది కాలేయం. అప్పుడు వ్యాధి తగ్గిందనుకుంటారు. కానీ కాలేయం పూర్తిగా యధాస్థానంలోకి వచ్చిందని అర్థం కాదు. దాని పునరుత్పత్తి శక్తి వల్ల మాత్రమే అది తన పనులు నిర్వహించగలుగుతుంది. కానీ మనిషి వ్యాధి తగ్గుముఖం పట్టిందని తగని అలవాట్లను కొనసాగిస్తే జబ్బు ముదిరిపోయి బయటపడుతుంది. అంతవరకు పోకుండా ఉండాలంటే కాలేయంపై, కాలేయవ్యాధులపై అవగాహనతో మెలగడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.

కాలేయం-ఆహారం

మనం ఏం తింటున్నాం, ఏం తాగుతున్నాం, వ్యాయామం చేస్తున్నామా లేదా అన్నది చాలా ముఖ్యం. సాధారణంగా ఆహార

పదార్థాలలోని విషతుల్య పదార్థాల హానికర గుణాన్ని తగ్గించి వేయడంలో కాలేయం అద్భుతంగా పనిచేస్తుంది. ఉదాహరణకు క్రిమి సంహారక మందులను ఎక్కువగా వాడే కాయగూరలు, పండ్లు, ఆహారం నిల్వవుంచడానికి ఉపకరించే రసాయనాలు, మద్యం, హాని కలిగించే మందులు, కల్తీ పదార్థాల సేవనం వంటి విషగుణాల్ని ఎదుర్కొని శరీరానికి ఉపయోగకరమైన ఐరన్, కాపర్ విటమన్ ఎ, డి, బి12 నిల్వపరిచే అవయవంగా కాలేయం ప్రత్యేకత ఎంతో విలువైంది. ఈ కార్యకలాపంలో లోపం కనపడితే ఆకలి మందగిస్తుంది. జీర్ణక్రియ దెబ్బతింటుంది. రక్తంలోని చక్కెరశాతంలో మార్పులు వస్తాయి. ఎలర్జీ, సోరియాసిస్, మలబద్ధకం వంటి లక్షణాలు ఏర్పడతాయి. తరచుగా ఫాటీ లివర్ అనేది 'స్కాన్' రిపోర్టులలో గమనిస్తుంటారు. ఇది ఆల్కహాలిక్, నాన్ ఆల్కహాలిక్

అని రెండురకాలు. ఫాటీ లివర్ వస్తే మద్యపానం విధిగా మానేయాలి. మద్యపానం కొనసాగిస్తే కణాలు దెబ్బతిని సిరోసిస్ వ్యాధికి దారితీస్తుంది. మద్యపానం చేసేవారిలో కణాల పునరుత్పత్తి మందగిస్తాయి. అయితే వారు కొన్నిరకాల ఆయుర్వేద మందులు వాడితే మంచి ఫలితం ఉంటుంది.

ఈ వ్యాధుల పట్ల అప్రమత్తత

కాలేయవ్యాధుల్ని నయం చేయగలిగే మందులు అనేకరకాలుగా వున్నాయి. అయితే కొన్నిరకాల వ్యాధులు ప్రాణాంతకంగా మారతాయి. ముందే గమనించకపోతే ప్రాణాల్ని హరిస్తాయి. కామెర్ల విషయంలో అవగాహనతో ఉండాలి. రక్తంలో బైల్ పిగ్మెంట్ 'బిలిరుబిన్' అధికంగా చేరటం వల్ల చర్మం, కనుగుడ్లు పచ్చగా మారుతాయి. మూత్రం నల్లరంగులో వస్తుంది. కాలేయం వాచి పైత్యరస ప్రవాహాన్ని అడ్డుకోవటం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఎర్రరక్త కణాల విచ్ఛిత్తి వల్ల శిశువులలో ఈ వ్యాధి వస్తుంది.

కాలేయానికి జీర్ణాశయం నుంచి రక్తం తీసుకువచ్చే నాళం పోర్టల్ హైపర్ టెన్షన్. కాలేయానికి చేరే రక్తానికి అడ్డు తగలటం వల్ల ఈ నాళంలో రక్తపోటు పెరుగుతుంది. ఈ కారణంగా రక్తం కాలేయాన్ని వదిలి ప్రవహిస్తుంది. అందువల్ల కాలేయం నిర్మూలించే ప్రమాదకర పదార్థాలు నేరుగా రక్తంలో చేరుతాయి. పొట ఉబ్బటం, ఆహారనాళంలో కంతులు ఏర్పడి చిట్లటం వల్ల రక్తవాంతులు రావటం ఈ వ్యాధి లక్షణాలు.

కామెర్లు, వైరల్ హెపటైటిస్, సిర్రోసిస్ వంటి ముఖ్యమైన కాలేయ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తపడాలి. నీరు, ఆహార పదార్థాలు, కొన్నిరకాలయిన మందుల వాడకం, మద్యపానం వల్ల కామెర్లు వస్తాయి. దేహంలోకి హెపటైటిస్ వైరస్ ప్రవేశిస్తే రెండు వారాల్లో దాని లక్షణాలు బయటపడతాయి. ప్రపంచమంతా వ్యాపించిన ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సిన్‌లు వచ్చాయి. కానీ క్రమశిక్షణతో కూడాన జీవనశైలి, ఆహారపుటలవాట్లు పాటించాలి ప్రతి ఒక్కరు. విసర్జనక్రియ సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే వైద్యుల్ని సంప్రదించాలి. కాలేయ సంబంధిత వ్యాధుల్ని నయం చేయడానికి అల్లోపతిలోనే గాక ఆయుర్వేదం, హోమియో వైద్యవిధానాల్లోని మందులున్నాయి. అయితే ఎవరికివాళ్ళు ఆరోగ్యకరమైన ఆహారపానీయాలు తీసుకోడానికి ప్రాముఖ్యం ఇవ్వడం మంచిది. ఆయుర్వేదంలో కాలమేఘ (నేలవేము), భూమ్యామ్లకి (నేల ఉసిరి), పునర్నవ (గలిజేరు), భృంగరాజ (గుంట గలగర), కటుకి (కటుక రోహిణి), గుడూచీ (తిప్పతీగె) వంటి ఓషధులతో కూడిన మందులు ఆయుర్వేదంలో లభిస్తాయి. వీటిని రోగి వ్యాధిస్థాయి, తీవ్రతలని బట్టి ఆయుర్వేద వైద్యులు సూచిస్తారు.

హోమియోచికిత్స సాధ్యమే

కాలేయం పెరగడం, చిన్నదవడం, కడుపునొప్పి, అతిగా విరేచనాలు, పైత్య విరేచనాలు, వాంతులు, రక్తవాంతులు కావడం వంటి లక్షణాలు కనిపిస్తే కాలేయం సరిగా పనిచేయడం లేదని గ్రహించాలి. ఆహారపుటలవాట్లలో వచ్చిన మార్పులే వీటికి మూలం. కామెర్లు, హెపటైటిస్-బి, కాలేయంలో పుండ్లు ఏర్పడటం మొదలైన సమస్యలు తలెత్తుతాయి. వీటి నివారణకు హోమియో వైద్యవిధానంలో తగిన చికిత్స లభిస్తోంది. మొదట్లోనే గుర్తిస్తే కొన్నిరకాల మందుల వాడకంతో సులభంగా నయం చేయడం సాధ్యం.

సైలీషియా 200: కాలేయం పుండ్లు చీముపట్టి మంట, అది మూత్రంలో కలిసి వెలువడటం జరిగినప్పుడు ఈ మందు వాడాలి.

సెపియా 200: ఛాతీ కుడివేపు పోటుల, మంట, కామెర్లు సోకిన వారికి ఇవ్వాలి.

మెర్క్‌సాల్ 200: కాలేయంలో తీవ్రంగా నొప్పి, ఊపిరి దుర్వాసన, చిగుళ్ళు మెత్తబడడం వంటి లక్షణాలుంటే వాడాలి.

ఆర్సెనికం ఆల్బం 200: కాలేయం పెరగడం, శరీరావయవాలు ఉబకరించి తీవ్రమైన బాధ కలిగినప్పుడు ఈ మందు వాడితే ఉపశమనం లభిస్తుంది.

నేట్రంసల్ఫ్ 200: కాలేయం పెరగడమనే దీర్ఘవ్యాధిగ్రస్థుల్లో పొట్ట ఉబ్బరింపు, నడుంనొప్పి, వికారం, తలనొప్పి మొదలయిన లక్షణాలుంటాయి. అటువంటప్పుడు ఈ మందు వాడకం మంచిది.

కామెర్లు రాకుండా ఉండటానికి ముందుగానే తగిన హోమియో మందులు వాడాలి. కాలేయజబ్బుల లక్షణాలు కనిపించిన వెంటనే హోమియో వైద్యుని సంప్రదించాలి. లక్షణాలు, వ్యాధి తీవ్రత, మనిషి వయసు, ఆరోగ్యస్థితిని గమనించి ఎలాంటి జబ్బు ఉన్నదో, కాలేయం ఏ స్థితిలో ఉన్నదో నిర్ధారిస్తారు. ఆ తర్వాత తగిన మందులు ఇస్తారు. వైద్యుల సూచనప్రకారం మందులు వాడటం, ఆహారపుటలవాట్లు మార్చుకోవడం అవసరం. తద్వారా ఆరోగ్యం చేకూరుతుంది. వ్యాధి ముదరకముందే వైద్యుల్ని సంప్రదించడం అవసరం.

– డాక్టర్ దండెపు బస్వానందం

ప్రమాదకరమైన సిర్రోసిస్

కాలేయం కణాల స్థానాన్ని పీచుపదార్థం ఆక్రమించటాన్ని ఫైబ్రోసిస్ అంటారు. సాధారణంగా ఇది సిర్రోసిస్‌కు దారితీస్తుంది. సిర్రోసిస్ అంటే కాలేయం గట్టిపడి, కుచించుకుపోవటం. కాలేయం కణాలను హెపొటైటిస్ వైరస్ నాశనం చేస్తుంది. దీనితో ఆహారంలోని కొవ్వు పదార్థాలు ఆ స్థానాన్ని ఆక్రమిస్తాయి. రక్తంలో చేరతాయి. దాంతో పీచుపదార్థం కాలేయంపై పడుతుంది. కాలేయం కుచించుకుపోయి గట్టి పడుతుంది. ఇది ప్రమాదకరమైన జబ్బు. ఎందుకంటే కాలేయంపై పడిన



పీచుపదార్థం పునరుత్పత్తిని అడ్డుకుంటుంది. వైరస్ కాక ఈ పరిస్థితి ఏర్పడటానికి మద్యపానం ప్రధాన కారణం. సాదరణంగా మద్యాన్ని కాలేయం కార్బన్ డయాక్సైడ్‌గా, నీరుగా వేరు చేస్తుంది. ఎక్కువగా మద్యం తీసుకుంటే కాలేయం పని వేగం తగ్గుతుంది. మందకొడిగా పనిచేస్తుంది. ఇందువల్ల కాలేయంలో కొవ్వు పదార్థాలు చేరుతాయి. దీనితో 'సిర్రోసిస్ ఆఫ్ లివర్' జబ్బు వస్తుంది. ఈ వ్యాధి నయం కావడం అంత సులభం కాదు. చికిత్స లేని వ్యాధి. దీని తీవ్రతను వైద్యులు నిర్ధారిస్తారు. వారి మార్గదర్శకాల ప్రకారం మద్యం పూర్తిగా మానివేస్తే, తగిన మందులు తీసుకుంటే కాలేయం మరింత పాడుగాకుండా ఉంటుంది. కానీ పూర్తిగా పాడయిపోయిన స్థితిలో వైద్యులు కూడా ఏమీ చేయలేరు. ఇలాంటి వారికి కాలేయమార్పిడి ఎంతవరకు సాధ్యమన్నది రోగి పరిస్థితిని పరీక్షించాక వైద్యులు నిర్ధారిస్తారు. సిర్రోసిస్ ఆఫ్ లివర్ మరింత తీవ్రమైతే లివర్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఒక అంచనా ప్రకారం సిర్రోసిస్ సోకిన వారిలో ముప్పయి శాతం మంది దీని బారిన పడుతున్నారు. ఇది ప్రాణాంతక పరిణామం. అందుకని మనిషి దేహంలో అతి ముఖ్యమైన కాలేయం జాగ్రత్తగా చూసుకోవడం అవసరం. కాలేయమార్పిడి అన్నది అవసరమైనప్పుడు మాత్రమే చేస్తారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి

నగరీకరణ పెరిగింది. పట్టణాలకు వలస విపరీతమైంది. వండుకోడానికి కూడా సమయం లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ తింటున్నారు. డబ్బున్న ఉన్నత, ఉన్నత మధ్యతరగతి వర్గాలవారు కూడా ఎక్కువగా బయటి తిండికి అలవాటు పడ్డారు. రకరకాల పేర్లతో పార్టీలు చేసుకుంటూ ఆహారాన్ని అతిగా తీసుకుంటున్నారు. వాడవాడలా మద్యం దుకాణాలు పిల్లల్ని, పెద్దల్ని మద్య వ్యసనపరులుగా చేస్తున్నాయి. దీంతో చిన్నవయసులోనే కాలేయవ్యాధుల బారిన పడేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. నాలుగుకాలాల పాటు హాయిగా, ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యం మీరు తీసుకునే ఆహారం మీద, మీరు చేసే వ్యాయామం మీద ఆధారపడి వుంది. కాలేయం ఆరోగ్యంగా వుంటేనే మీరు ఆరోగ్యంగా ఉంటారు. కాలేయం హాయిగా నవ్వగలిగే స్థితిలో ఉండాలి. అది మీ చేతుల్లోని వుంది. జీవితంలోని ప్రతిదశలో క్రమశిక్షణ అవసరం. మరీ ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో ఇది తప్పనిసరి. వైద్యవిజ్ఞానం పెరిగి అనేకరకాల మందులు వచ్చాయి. అవసరమైతే కాలేయమార్పిడి కూడా సాధ్యమే. అందుకని రోగాల పాలయి కాలేయదానం కోసం ఎదురుచూసే రోగగ్రస్థులవుతారా? శుచి, శుభ్రత, క్రమబద్ధమైన ఆహారపుటలవాట్లు, నిత్యవ్యాయామం మనిషి జీవనశైలిలో భాగం కావాలి. భోగభాగ్యాలు ఎన్ని వున్నా ఆరోగ్యంగా వున్నప్పుడే అనుభవించగలరు. అందుకని ఆరోగ్యకరమైన జీవనశైలి మాత్రమే మీ కాలేయానికీ, మీకూ సరైన రక్ష.

– డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తి, 98852 97983

కాలేయ మార్పిడి

ముంబయిలో ఏటా లివర్ సిరోసిస్, లివర్ క్యాన్సర్ వల్ల దాదాపు రెండువేల మంది మరణిస్తున్నారు. నిరంతరం కనీసం మూడువందల మంది కాలేయమార్పిడి కోసం ఎదురు చూసే రోగులు వుంటున్నారని లివర్‌మార్పిడిలో నిపుణుడైన గుర్‌గావ్‌కు చెందిన డాక్టర్ ఏ.ఎస్.సోని చెబుతున్నారు. దేశంలో ప్రతి అయిదుగురిలో ఒకరికి కాలేయవ్యాధి ఉందంటున్నారాయన. కాలేయమార్పిడి కోసం క్యూ కట్టేవారి సంఖ్య రానున్న కాలంలో మరింతగా పెరుగుతుందని డాక్టర్ సోని అంచనా.

1963లో అమెరికాలో థామస్ స్టార్జిల్ ఇంగ్లాండ్‌లో 1965లో రాయ్‌కాల్న్‌లు 'కాలేయమార్పిడి' శస్త్రచికిత్సకు ఆద్యులు. మొదట్లో పాశ్చాత్యదేశాల్లోనే ఈరకమైన కాలేయమార్పిడి అపరేషన్లు ఎక్కువగా జరిగేవి. అప్పట్లో ఖర్చు ఎక్కువ కారణంగా భారతదేశంలో తక్కువ. కానీ ఇప్పుడు చాలా కార్పోరేట్ ఆస్పత్రుల్లో కాలేయమార్పిడి శస్త్రచికిత్సలు సాధారణమయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈవిధమైన శస్త్రచికిత్సల సంఖ్య పెరుగుతున్నది.

కాలేయం పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితిలో కాలేయమార్పిడి అవసరం. చెడిపోయిన కాలేయాన్ని తొలగించి, దాని స్థానంలో ఆరోగ్యవంతమైన కాలేయాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ కాలేయం మరణించిన వారి శరీరం నుంచి కానీ, జీవించివున్నవారి శరీరం నుంచి గానీ సేకరించవచ్చు. జీవించివున్న వారి కాలేయంలో 20 శాతం మాత్రమే తీసుకుని, రోగి శరీరంలో ఉంచుతారు. పునరుత్పత్తి శక్తి వల్ల రోగి శరీరంలో కాలేయం పూర్థిస్థాయిలో అభివృద్ధి చెందుతుంది. ఇటువంటి మార్పిడి 1989లో మొదటిసారి ఫలప్రదంగా జరిగింది. శిశువులలో, చిన్నపిల్లల్లో ఈ మార్పిడి విజయవంతమవుతుంది. కొత్త కాలేయం స్వీకరించడమన్నది ఆయా మనుషుల ఆరోగ్యస్థితిని బట్టి ఉంటుంది. ఏమైనా కాలేయమార్పిడి శస్త్రచికిత్స మనిషికి వరం లాంటిది. కానీ ఇంతటి తీవ్రస్థాయికి వెళ్ళకుండా మొదటే జాగ్రత్తపడటం శ్రేయస్కరం.

■ సృజన

నల్లజాతి మహిళల కంఠస్వరం

టోనీ మోరిసన్ 1993లో సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన ఎనిమిదవ మహిళ. అమెరికాలో ఆ బహుమతి పొందిన మొదటి మహిళ. నల్లజాతి మహిళగా కూడా ఆమె మొదటివారు. కాల్పనిక శక్తి, కవితాత్మక వచనంతో భాసిల్లే ఆమె నవలలు, ప్రధానమైన వాస్తవ అమెరికా దృష్టికోణాన్ని చిత్రిస్తాయని నోబెల్ బహుమతి ప్రదాతలు ఆమెను ప్రశంసించారు.

టోనీ మోరిసన్ (18 ఫిబ్రవరి 1931) గా మారిన క్లోయే ఆంటోనీ వొఫ్ఫోర్డ్ లోరైన్, ఒహియోలో జన్మించారు. ఆమె అసలు పేరు క్లోయే వొఫ్ఫర్డ్. 12ఏళ్ల ప్రాయంలో కేథలిక్ చర్చ్ లో చేరాక, వచ్చిన బాప్టిజం పేరు ఆంటోనీ. వివాహం చేసుకున్నాక భర్త పేరు మోరిసన్ చివర చేరింది. అయితే తన పేరు పలకడం సులభం చేయడానికి ఆంటోనీ లోని టోనీని తీసుకుని టోనీ మోరిసన్ గా మార్చుకున్నారు. తండ్రి జార్జ్ వొఫ్ఫోర్డ్ నౌకానిర్మాణ కేంద్రంలో వెల్డరు. కష్టజీవి. పిల్లలకోసం 17ఏళ్లపాటు, రోజుకి మూడు చోట్ల పని చేసేవారు. తల్లి ఎల్లా రమహ్ విల్లిస్ వొఫ్ఫోర్డ్ ఆధ్యాత్మిక స్త్రీ, చర్చి గాయకబృందంలో పాటలు పాడేవారు. వారికి ఇద్దరు ఆడపిల్లల తరువాత ఇద్దరు మగపిల్లలు. అందులో రెండో బిడ్డ మోరిసన్. దక్షిణ ప్రాంతపు జాత్యాహంకారం నుండి తప్పించుకునేందుకు ఉత్తరాన ఉన్న ఒహియో కి తరలివచ్చారు. అయినా దక్షిణ ప్రాంతంలోని ఆఫ్రో అమెరికన్ ప్రజల మౌఖిక సంప్రదాయాలు ఆ కుటుంబం వదలలేక పోయింది. బాల్యంలో క్లోయే వొఫ్ఫోర్డ్ విన్న పాటలు కథలు, తరువాత ఆమె రచనల మీద బాగా ప్రభావం చూపాయి. ఆమె మాతామహులు కూడా అలబామా నుండి ఒహియోకి అలా వచ్చినవారే. పిల్లల చదువుపట్ల వారి శ్రద్ధ, వారు పిల్లలకు చదివి వినిపించిన కథలే 1977లో వచ్చిన ఆమె నవల 'సాంగ్ ఆఫ్ సోలమన్'కు ప్రేరణ.

టోనీ అత్యంత ప్రతిభావంతురాలైన విద్యార్థిని. అతి చిన్న వయసులోనే చదవగలిగే స్థాయికి చేరుకుంది. బడిలో ఒకే ఒక్క ఆఫ్రో అమెరికన్ విద్యార్థిని. పిల్లలందరిలోనూ చురుకైనది, నేర్పుగలది కావడంతో మిగతా పిల్లలకు సాయం చేయమని ఉపాధ్యాయులే చెప్పేవారు. కొత్తగా చేరిన విదేశీ పిల్లలకు సాయపడటంలో ఎక్కువ ఆనందం పొందేది. జాతిపరంగా భిన్నమైన వర్గాల పిల్లలతో లేతవయసులో ఆడుకునేది. పెరుగుతున్నకొద్దీ అనివార్యంగా జాతివిచక్షణ అనుభవంలోకి రావడం మొదలయింది.

13-14 ఏళ్ల ప్రాయంలో టోనీ, ఒక తెల్లవాని ఇంట పనికత్తెగా చేరాల్సిచ్చింది. అక్కడి పొయ్యి వాడకం, ఇల్లు ఊడ్వడం లాంటి పనులు తెలియక వారితో తిట్లు తినేది. ఒక్కోమారు భరించలేక ఇంటికి తిరిగొస్తే, తన తల్లి మానేయమనేది. కానీ వారానికి వచ్చే రెండు డాలర్లు పోతాయని బాధపడేది. తండ్రి ఎవరినీ నమ్మేవారు కాదు. ఆ డబ్బులైనా నువ్వు తెచ్చుకోలేకపోతే ఇక్కడ ఉండొద్దు, వెళ్లు, నీ డబ్బులు నువ్వు తెచ్చుకో – అని తండ్రి మందలించేవాడు. స్కూల్ లో చదువుతుండగా ఒక ఇటాలియన్ అబ్బాయి – ఏయ్ ఇథోపియన్ అని వెక్కిరిస్తే, అదేమిటో తెలియక తల్లినడిగింది. అది ఒక దేశం పేరు అని తెలుసుకున్నాక, అంతేనా అనుకుంది.

టోనీ కాలేజీకి వెళ్లిన 17ఏళ్ల ప్రాయంలోనే వాషింగ్టన్ బస్సుల్లో శ్వేతేతరుల కోసం అని రాసి ఉండటం ఆమెను ఆశ్చర్యపరిచేది. నువ్వంటే నాకు ఇష్టమే కానీ, నువ్వు మంచిదానివే కానీ .. లాంటి మాటల్లోని అంతరార్థం అర్థం కావడం మొదలయింది. నల్లవారి పట్ల తెల్లవారి వైఖరిని తిప్పికొట్టాలన్న కసి ఉన్నా, అదెలా చేయాలని ఆలోచనల్లో తిరుగాడేవారు.

హోవర్డ్ విశ్వవిద్యాలయంలో పట్టభద్రురాలయ్యాక, చాలామంది తన పేరు సరిగ్గా పలకలేక పోవడం మూలాన, 1953లో తన పేరు టోనీ ఆంటోనీగా మార్చుకున్నారు. 1955లో కోర్నెల్ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పుర్తి చేసాక, టెక్సాస్ సదర్న్ విశ్వవిద్యాలయంలో బోధనావృత్తిలో కొన్నాళ్లు గడిపి, హోవర్డ్ విశ్వవిద్యాలయానికి తిరిగొచ్చారు. ఆ సమయంలోనే మొదలయిన పౌరహక్కుల ఉద్యమంలో అనేకమంది క్రియాశీలక కార్యకర్తలను కలుసుకున్నారు. ఉద్యమక్రమంలోవారిలో ముఖ్యులు – మార్టిన్ లూథర్ కింగ్ తో కలిసి పనిచేశారు. 1958లో జమైకా వాసి భవనశిల్పి హరోల్డ్ మోరిసన్‌ని పెళ్లి చేసుకున్నారు అప్పటినుంచీ ఆమె టోనీ మోరిసన్ అయింది. 1961లో మొదటి కొడుకు హరోల్డ్ ఫోర్డ్ పుట్టాడు. కుటుంబాన్ని చూసుకుంటూనే శిక్షకురాలుగా పనిచేశారు. వైవాహిక జీవితంలోని ఒడిదుడుకుల్ని తప్పించుకుందుకు అదే సమయంలో అక్కడ ఉన్న రచయితల సంఘంలో చేరారు. ఈ లోగా ఆమె మరల గర్భవతిగా ఉండగా, వైవాహిక జీవితం మరింత క్షీణించింది. భర్తతో విడాకులూ తీసుకుంది. 1964లో రెండవ కొడుకు స్లేడ్ కెవిన్ పుట్టాడు. ఆరేళ్లలో హరోల్డ్ ఫోర్డ్, స్లేడ్ కెవిన్ వారికి ఇద్దరు కొడుకులు. భర్తకు అణకువగా ఉండి, అతనికి బదులివ్వని భార్యగా ఉండలేకపోవడమే భర్తతో విడాకులకు కారణమని ఆ తర్వాత ఓ సందర్భంలో చెప్పారామె.

1964లో టోనీ, పాఠ్య పుస్తకాల విభాగంలో సహ సంపాదకురాలుగా న్యూయార్క్ లో చేరారు. ఇద్దరు పిల్లల్ని ఇంటి యజమానురాలు దగ్గర వదిలి, రోజంతా అందులో పని చేస్తూ సాయంత్రం ఇంటికి చేరుకునేవారు. వంటపని చేసుకుని, పిల్లలతో గడిపి, వారు తిని నిద్రపోయాక రాయడం, లేదా పిల్లలు లేవకముందే ఉదయం నాలుగింటికి లేచి, ఆఫీసుకు వెళ్ళేలోగా రాసుకునే పనిలో ఉండేవారు. తాను రచయితల సంఘంలో అంతకుముందు చదివిన కథనే దుమ్ము దులిపి నవలగా మార్చాలని నిర్ణయించుకున్నారు. బాల్యంలోని జ్ఞాపకాలకు ఊహల్ని జోడించి రాయడం కొనసాగించారు. అదే ఆమె మొదటి నవల 'అతినీల నేత్రం'(ద్బ్లువ ఎశ్రీబవర్ వఎవ)'. 39 ఏళ్ల యవ్వనంలో ఇద్దరు పిల్లలతో, భర్తను వదిలేసిన ఒంటరితనంలో రాయడం మొదలెట్టారు. రాయడం ఆమెకు

ఉత్సాహంగానూ, సవాలుగానూ ఉండేది.

1967లో తాను పని చేస్తున్న సంస్థలోనే కాల్పనిక సాహిత్య విభాగానికి టోనీ సంపాదకురాలయ్యారు. ప్రముఖ నల్లజాతి రచయితలైన మహమ్మదాలి, ఏండ్రూ యంగ్, ఆంజెలా డేవిస్ లాంటి వారి రచనలకు సంపాదకత్వం వహిస్తూనే తన నవల "అతినీల నేత్రం" ప్రచురణకర్తను సంపాదించగలిగి, 1970లో దాన్ని ప్రచురించగలిగారు. అది విమర్శకుల ప్రశంసలు పొందగలిగినా పాఠకులు అంతగా ఆదరించలేదు. ఉద్యోగంలో కొనసాగుతూనే రెండవ నవల "సూలా" ను 1975లో తీసుకువచ్చారు. ఆ రెండు నవలలూ వచ్చాక మొదటిసారి తన స్వరం తాను తెలుకోగలిగానని చెప్పేవారు టోనీ. "అతినీల నేత్రం" కన్నెరికం పోయిన స్త్రీ కథ అయితే, సూలా ఎదురు తిరిగే స్త్రీ, నల్లజాతీ స్త్రీల మధ్య సంబంధాలతో కూడిన ప్రేమకథ.

1976-1977 మధ్య యేల్ లో విజిటింగ్ ప్రొఫెసర్గా పనిచేస్తూ రాసిన మూడో నవల 'సాంగ్ ఆఫ్ సాలమన్'. 1977 లో వెలువరించారు. అది మొదటిసారి వాణిజ్యపరంగానూ, విమర్శనాత్మకంగానూ విజయం సాధించింది. 1981లో ఒక స్త్రీ, ఒక పురుషుని మధ్య సంచలన సంబంధాల మాధ్యమంగా నాలుగో నవల "టార్ బేబీ" వచ్చింది. 1987లో వచ్చిన అయిదో నవల "బిలవ్డ్" ఆమె ఉత్కృష్టమైన నవల. ఈ నవల ఎలా రాయాలని ఆలోచిస్తూ మూడేళ్లు గడిపారు. బానిసత్వంలోకి తిరిగి పంపే బదులు తనకు కూతురు లేకపోవడం మంచిదని ఆమెను చంపేసిన తల్లి మార్గరెట్ గార్నర్ యథార్థ కథ అది. దాస్యవిముక్తిరాలయిన ఒక బానిస స్త్రీని, తాను చంపిన కూతురు దెయ్యమయి పీడించడం కథ. ఆ నవలను, అట్లాంటిక్ ప్రయాణంలో వేలకొద్దీ మరణించిన బానిసలకు అంకితమిచ్చారు. ప్రతీ మానవ వ్యవస్థకు ఆవల, బానిసత్వపు అవస్థ ఎలా ఉందన్నది అందులో వివరించాలనుకున్నారు. అయితే అందుకు తగ్గ భాష కోసం అన్నాళ్లు ఆగాల్సొచ్చింది. ఆ నవల అత్యంత ప్రజాదరణ పొందడమే కాక, పులిట్జర్ బహుమతి కూడా పొందింది. తర్వాత1998లో సినిమాగా వచ్చింది.

1983లో ఇరవయేళ్ళుగా పని చేస్తున్న సంస్థను వదిలి, 1987లో ప్రిన్సెటన్ విశ్వవిద్యాలయంలో మానవీయ శాస్త్రాల "రాబర్ట్ గోహెన్" ఆచార్యురాలుగా చేరారు. అలా చేరిన మొట్టమొదటి ఆఫ్రోఅమెరికన్ టోనీ. 1992 లో ఆమె ఆరో నవల 'జాజ్',1998లో ఆమె ఏడో నవల 'పారడైజ్' విడుదలయ్యాయి. 2003 లో వచ్చిన 'ప్రేమ' ఆమె ఎనిమిదో నవల, 2008లో తొమ్మిదో నవల 'ఒక దయ', 2012లో పదో నవల 'ఇల్లు', ఏప్రిల్ 2015లో రాబోతున్న నవల 'బిడ్డకు దేవుడు సాయపడాలి' ఇలా ఆమె రచనా పరంపర 83 ఏళ్ల వయసులో కూడా కొనసాగుతూనే ఉంది. ఈ 11 నవలలే కాక, రెండో కొడుకు స్లేడ్ కెవిన్ తో కలిసి పిల్లల కోసం రాసిన మూడు రచనలు, రెండు నాటకాలు, ఒక పెద్ద కథ, ఏడు గ్రంథాల నాన్‌ఫిక్షన్ కూడా వచ్చింది. నోబెల్ బహుమతి కాక మరో 24 ప్రముఖ బహుమతులూ లభించాయి ఆమెకి.

ఆఫ్రో అమెరికన్ సాహిత్య భాషను సృష్టించిన రచయిత్రి టోనీ. ఆమె పాత్రల చైతన్యానికి దగ్గరగా, దృష్టికోణం మార్చడం, ముక్కముక్కలైన వృత్తాంతం, వర్ణనాత్మక స్వరం, తాను అతిగా చదువుకున్న వర్జీనియా వూల్ఫ్, విలియం ఫాల్కనర్ ప్రభావాన్ని తెలియజేస్తుంది. ఎం.ఏ. లో భాగంగా ఆమె పరిశోధనా వ్యాసం కూడా వారిద్దరి రచనల్లో ఆత్మహత్యల మీద రాసిందే. అలాగే ఆఫ్రో అమెరికన్ పాటలు, జానపదం, స్త్రీల ముచ్చట్లు స్పష్టంగా కనిపిస్తాయి. రష్యన్ రచయిత టాల్‌స్టాయ్, డోస్టొవెస్కీ, ఫ్రెంచ్ రచయిత గిస్తావ్ ఫ్లెబేర్, ఆంగ్ల నవలా రచయిత్రి జేన్ ఆస్టెన్‌ల సాహిత్యాన్నీ చదువుకున్నారు.

బీద నల్లవారి స్థానిక భాషలో, సంప్రదాయబద్ధంగా టోనీ రచనలుంటాయి. అది తెల్లవారికి అపరిచితమైన భాష. ఆ కారణంగా అవి కష్టమైనవని లేదా కవిత్వమయం అన్న విమర్శ రావడంతో ఆమె బాధపడ్డారు. అయితే తర్వాత ఆ వ్యాఖ్యల్ని పట్టించుకోరాదని అనుకున్నారు. ఆమె రచనలు స్వీయచరిత్ర కాకపోయినా, గతాన్ని ప్రేమగా అవి ప్రస్తావిస్తూనే ఉంటాయి. "నేను మధ్యపశ్చిమానికి చెందినదాన్ని, దానిమీద నాకు ప్రత్యేక ప్రేమ ఉంది, నా మొదలు ఎప్పుడూ అక్కడి నుంచే, ఏది రాసినా అక్కడినుంచే మొదలెడతాను .. అది నా మాతృక. మూసపోసిన నల్లజాతి వాతావరణం నుండి నాకు ఒహియో విముక్తి ప్రసాదిస్తుంది" అని చెప్పారామె. "తెల్లవారికి, నల్లవారి జీవితం వివరించాలని రాసాను. అదేదో బయటి వ్యక్తిగా రాయదలుచుకోలేదు. నా లోపలి మనిషిగా రాసాను. నలుపే అందం అన్నది ఒక నినాదంగా నలుపు ఆందోళనకారులు ప్రచారం చేస్తున్న సమయంలో, కాదని ఎవరన్నారు, ఒక సమయంలో నలుపు అందవికారం, అంచాత మీరు గాయపడ్డారని నేను



కుమారులతో టోనీ మారిసన్

'అతినీల నేత్రం' నవల రాసాను" అని వివరించారు.

"మేము ఆఫ్రో-అమెరికన్లము. అమెరికాలో ద్వితీయశ్రేణి పౌరులం. అయినా ఆశావహులం. యుద్ధం తరువాత మేము వినియోగదారులమయాం. ఆర్జించడంలో ఆనందం మొదలయింది. తరువాత కేవలం పన్ను చెల్లించేవారమయాము. మా డాలర్లలో పన్ను ఏ ప్రజల కోసం? నేను కేవలం పన్ను చెల్లించడానికే అయితే నాకది నచ్చదు. ఒక పౌరుడికి తన ఇరుగుపొరుగు వారితోను, రాష్ట్రం తోను, దేశంతోను సంబంధాలుంటాయి, పన్ను చెల్లించేవారికి కాదు" అని టోనీ బాధపడ్డ సందర్భాలెన్నో ఉన్నాయి. ఒబామా అమెరికా అధ్యక్షుడు కావడం ఒక మంచి పరిణామం, తాను మొదటిసారి అమెరికా వాసినని అప్పుడు గర్వపడ్డానని చెబుతారు టోనీ. యాభయ్యేళ్ళకు పైగా రచయిత్రిగా గడిపిన జీవితాన్ని నెమరు వేసుకోవడంలో ఆనందం పొందుతారామె.

'ఇల్లు' నవల రాస్తున్న సమయంలోనే తనతో బాటు పిల్లల సాహిత్యం రాయడంలో తోడ్పడిన టోనీ రెండో కొడుకు కళాకారుడు స్లేడ్ కెవిన్ డిసెంబర్ 2010లో మరణించాడు. మరణించిన రెండవ కొడుకు స్లేడ్‌కి, ఆ నవల అంకిత మిచ్చారు. కొడుకు మరణాన్ని తట్టుకోలేకపోయారు. ఏ పనీ చేయలేక పోయారు. ఎవరితోనూ మాట్లాడ లేకపోయారు. ఓదార్పు వచనాల్ని సైతం వినలేకపోయారు. వయసు పెరిగితే ఏమవుతుంది, శరీరంలోను, జ్ఞాపకాల్లోనూ మార్పులొస్తాయి అంతే కదా అని తేలికగా చెప్పగలుగుతారు. ఆమె నవలల్లో శ్వేతజాతి వారు ఎక్కడా ప్రధానపాత్రల్లో ఉండరు. జాత్యహంకార పురుషాధిక్య సమాజంలో నల్లజాతి స్త్రీల పాత్ర, అనుభవాల అన్వేషణ ఆమె రచనలు. ఆమె నవలలు ఐతిహాసిక ఇతివృత్తాలు, స్పష్టమైన సంభాషణ, శ్రేష్ఠమైన వివరణాత్మక నల్లజాతి పాత్రల చిత్రణతో అలరారుతుంటాయి.

-ముకుంద రామారావు, 99083 47273

■ కథ : బి.పి.కరుణాకర్

మలి మిగులు

నేను కాకిని. సీతారాముడు కూడా కాకే. నిజానికి మాకు పేర్లుండవు. మా భాష మాకు వుంటుంది. ఒకరిని ఒకరం తేలికగా అర్థం చేసుకుంటాం. కొన్ని విషయాలు కలిసికట్టుగానే చేస్తుంటాం. మాలో బొంత కాకులని, నల్ల కాకులని తేడాలు ఉన్నాయి. ఎందుచేతో ఏమో అవి మాతో కలవవు. అప్పుడప్పుడు కనిపిస్తుంటాయి కానీ, ఎక్కడుంటాయో తెలియదు. ప్రపంచంలో నాలుగు వందల తెగలకు పైగా కాకులు ఉన్నాయని విన్నాను. మాలో ఎవరయినా చనిపోయినప్పుడు సంతాపసభ పెట్టుకుంటాం. చాలా మందిమి చేరుకుంటాం. కాకులు కలకాలం బతుకుతాయన్నది నిజం కాదు. మాకు ఆత్మలు ఉంటాయని గాని, మరో జన్మ వుంటుందని గాని ఏ మాత్రమూ నమ్మం.

గద్దలు మమ్మల్ని చూసి భయపడుతుంటాయి. మాకు అవి ఇబ్బంది కలిగిస్తే తరిమి తరిమి అవి పారిపోయేలా చేస్తుంటాం. మా పెద్ద శత్రువులు రెండే రెండు. ఒకటి పాములు. అవి మా గుడ్లను మింగేస్తుంటాయి. రెండు కోయిలలు. అవి మా జాతికి చేసే ద్రోహం అంతా ఇంతా కాదు. మా కాకులు పెట్టిన గుడ్లను గూట్లోనుండి కింద పడేసి, వాటి గుడ్లను మా గుడ్లలో వుంచి మా చేతే పొదిగిస్తాయి. మా జాతి అంతం కావడానికి కారణం కోయిలలే అవుతాయి. స్వచ్ఛభారత్ అనే మాట ఈ మధ్య వినబడుతోంది గాని మేం ఎప్పటి నుండో చేస్తున్నాం.

నేనూ సీతారాముడు ఒకే చెట్టుమీద వుంటుంటాం. ఆ చెట్టుకు ఆనుకునే విద్యుత్ స్థంభం వుండడం వలన అంతకు ముందుండే చాలా కాకులు వేరే చెట్లకు వెళ్లిపోయాయి. మేం వుంటున్న చెట్టు పాతది. పెద్ద గాలికి పడిపోయేలా వుంటుంది. బలహీనంగా ఉన్న వాటిని, ఓడిపోతున్న వాళ్ళను సమర్ధించడం నాకు అలవాటు అయింది. సీతారాముడు నాలాంటి ఆలోచనలు కలిగినవాడే. అలవాటయిన ప్రాణాల్లా ఆ చెట్టుకే అంటిపెట్టుకు వుండిపోయాం. వాడిని సీతారాముడు అనుకుంటూ ఉండడం వాడికి తెలియదు. నాకేం పేరు పెట్టుకున్నాడో నాకు తెలియదు.

మేం ఉంటున్న చెట్టు సుబ్బలక్ష్మి వాళ్ళింటి పెరటి గోడకు ఆనుకుని ఉంది. ఆమెకు అరవై సంవత్సరాలు ఉండొచ్చు. అంత లావూ కాదు, సన్నమూ కాదు. ఆమె భర్త చనిపోయి ఏడెనిమిది సంవత్సరాలు గడిచి ఉంటాయి. ఆమెకు ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల. వాళ్ళు ఎక్కడెక్కడ వుంటుంటారో మాకు తెలియదు. ఆమె దగ్గర వుండరు. ఒంటరిగా వుంటోంది. పిల్లలు ఎప్పుడో కార్లో అలా కలిసి వచ్చి గంటో, రెండు గంటలో వుంటారు. అరగంట పాటు నవ్వుకుంటూ బాగానే ఉంటారు. తర్వాత వాళ్ళ మీద వాళ్ళే అరుచుకుంటారో, తల్లిమీద అరుస్తుంటారో తెలియదు. కోపంగా వెళ్ళిపోతుంటారు. వాళ్ళు వెళ్ళిపోయాక పెరట్లోని బావి పక్కనే ఉన్న రాతిమీద కూర్చుని చేతుల్లో ముఖం పెట్టుకుని ఏడుస్తూ చాలా సేపు వుండిపోతుంది.

ఆమె వుంటున్న పెంకుటిల్లు ఒక మోస్తరుగా వుంటుంది. అది కట్టి యాభై సంవత్సరాలు పైబడి వుండొచ్చు. చాలాచోట్ల గోడలకు పెచ్చులు ఊడిపోయి వున్నాయి. ఒక మోస్తరు తుఫాను వచ్చినా పడిపోయేట్లు వుంటుంది. ఇంటి చుట్టూ ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచుతుంటుంది. ఆమె భర్త ఏం చేసేవాడో తెలియదు కాని అతని తాలూకు పింఛను వస్తుంది. అదే ఆమె జీవనాధారం అనుకుంటాను.

సుబ్బలక్ష్మి ప్రతి ఏటా భర్త సంవత్సరీకం చేయడం మానదు. ఎవరినో పిలిపించి పూజలు చేయించదు. ఇద్దరు పేదవాళ్ళకు కొత్త గుడ్డలు కొని దానం చేస్తుంది. సీతారాముడు ఆ రోజుకోసమే ఎదురు చూసేవాడు. ఎందుకంటే ఆమె అరిటాకులో గారెలు, మరికొన్ని పదార్థాలు వుంచి నూతి పళ్ళెం మీద పెట్టి ఇంట్లోకి వెళ్ళడం ఆలస్యం, మా వాడు అరిటాకు దగ్గరకు

సీతారాముడు నాలాంటి ఆలోచనలు కలిగినవాడే. అలవాటయిన ప్రాణాల్లా ఆ చెట్టుకే అంటిపెట్టుకు వుండిపోయాం. వాడిని సీతారాముడు అనుకుంటూ ఉండడం వాడికి తెలియదు. నాకేం పేరు పెట్టుకున్నాడో నాకు తెలియదు

చేరి, గారెలు తినడం మొదలెడతాడు. వాడికి గారెలంటే ఇష్టం. వాడలా తింటోంటే ఆమె వంటగది తలుపుకు ఆనుకుని సంతోషంగా చూస్తూ ఉన్నా, ఆమె కంట్లోంచి నీళ్ళు తుడుచుకుంటున్నా ఆగవు. ఆ దృశ్యం చూసినప్పుడల్లా బాధగానూ వుంటుంది. సంతోషంగానూ ఉంటుంది.

అంతా సవ్యంగా వుంటే బాగుండేది. ఎవరో ఆకతాయి పిల్లలు రాళ్ళతో కొడితే సీతారాముడి కాళ్ళకు దెబ్బలు బాగా తగిలాయి. ఎలాగో ఎగిరి చెట్టు మీదకు వచ్చి ఖాళీగా వున్న గూటిలో వుండిపోయాడు. రెండు మూడు రోజులకు గాయాలు మానిపోతాయనుకున్నాను. మానలేదు. ఎర్ర చీమలు చేరడం మొదలెట్టాయి. సామాన్యంగా మా గూళ్ళదరిదాపులకు ఏ రకమైన చీమలూ రావు. నాకు భయం వేసింది. వాడికి తినడానికి అవీ ఇవీ తీసుకువచ్చి ఇచ్చేవాడిని. సగం తిని సగం వదిలేసేవాడు. వాడికి నయమై పోతుందనే నమ్మకం కుదిరింది. కానీ నా అంచనా తప్పయింది. సీతారాముడు చనిపోయాడు. నేనెంతో ప్రేమించినవాడు లేడు అనుకోడానికి కూడా మనసొప్పలేదు. వార్త అందరికీ అందించాను. చాలామంది వచ్చారు. సంతాపసభ అంత ఘనంగా జరుగుతుందని అనుకోలేదు.

ఒంటరినైపోయాను. ముందు చెట్టు మారదామనిపించింది. మారలేకపోయాను.

వచ్చే ఏడాదికి సుబ్బలక్ష్మి పెట్టేవి తినడానికి మాలో ఎవరయినా వెళ్తారు అది ప్రశ్న కాదు.

పదకొండోరోజు దగ్గరవుతోంది. నాకు ఎదురయిన సమస్య ఏమిటంటే సీతారాముడి తద్దినం చేయడం ఎలా? గారెలు, బూరెలంటే ఏ గారెలమ్మే కొట్టునుంచో దొంగతనం చేసి తీసుకురాగలను. మరి పిండం మాటేమిటి?

*

■ సంగీతం

సంగీత దర్శకుడిగా సుపరిచితమైన పి.ఆదినారాయణరావు నాటకాలు, సినిమా కథలు, పాటల రచయితగా, వాయిద్య కళాకారుడిగా, నిర్మాతగా పలు కళల్లో ప్రజ్ఞాశాలి అనిపించుకున్నారు. ఈయన సంగీత దర్శకత్వం వహించిన అనార్కలి, పల్లెటూరిపిల్ల, సువర్ణసుందరి, మోసగాళ్ళకు మోసగాడు, అల్లూరి సీతారామరాజు, భక్త తుకారాం, సతీ సక్కుబాయి, స్వర్ణమంజరి, మహాకవి క్షేత్రయ్య, ఛండీప్రియ వంటి చిత్రాలన్నీ సంగీత పరంగా విజయం సాధించినవే. మరపురాని బాణీలతో ఆకట్టుకుంటాయి ఈ చిత్రాల్లోని పాటలు. వీటిలో ఎక్కువ శాతం సొంత బ్యానరైన 'అంజలీ పిక్చర్స్' సంస్థలో నిర్మించినవే. ఆ చిత్రాల్లో కొన్ని మధురమైన పాటలు...

గన ఓయీ సఖా... హాయీ సఖా.. లీలగా పువులు గాలికి వూగ... కలిగిన తలపుల వలపులు రేగ... ఊగిపోవు మది ఉయ్యాలగా... జంపాలగా...".

ప్రకృతి ముందు పుట్టి తర్వాతే మనిషి పుట్టాడు. లోకంలోని మిగతా జీవరాశి మొత్తం ప్రకృతికి ఏ హానీ చేయట్లేదు. కానీ మనిషి మాత్రం అకృత్యాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నాడు. మంచి ప్రవర్తనతో వుంటే లోకమే నందనవనం అవుతుంది. మానవుడు అలా వుండాలనే ఉద్దేశంలో పాడే పాట అక్కినేని నాగేశ్వరరావు, అంజలి నటించిన 'భక్త తుకారాం' చిత్రంలోని "భలే భలే అందాలు సృష్టించావు ఇలా మురిపించావు... అదే ఆనందం, అదే అనుబంధం, ప్రభో మాకేల ఈయవు". ఈ పాటకి వేటూరి వెంకట సత్యసూర్యనారాయణ మూర్తి సాహిత్యం అందించారు. ఘంటసాల ఆలపించారు. ఇదే చిత్రంలో "ఘనా ఘన సుందరా, కరుణారస మందిరా అది పిలుపో మేలు కొలుపో, పడవెళ్ళిపోతుందిరా ఓ నరుడా, ఉన్నావా అసలున్నావా... వుంటే కళ్ళు

మరపురాని మధురమైన బాణీలు

ప్రకృతి ముందు పుట్టి తర్వాతే మనిషి పుట్టాడు. లోకంలోని మిగతా జీవరాశి మొత్తం ప్రకృతికి ఏ హానీ చేయట్లేదు. కానీ మనిషి మాత్రం అకృత్యాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నాడు. మంచి ప్రవర్తనతో వుంటే లోకమే నందనవనం అవుతుంది. మానవుడు అలా వుండాలనే ఉద్దేశంలో పాడే పాట "భలే భలే అందాలు సృష్టించావు ఇలా మురిపించావు... అదే ఆనందం, అదే అనుబంధం,

సలీం, అనార్కలీల ప్రేమకావ్యానికి దృశ్య రూపం ఏయన్నార్, అంజలీదేవి నటించిన 'అనార్కలీ' చిత్రం. ఇందులో ఖవ్వాలి బాణిలో ఉత్తర హిందూస్థానీ తరహా కథక్ నాట్యంతో చిత్రీకరించిన పాట "రాజశేఖరా నీపై మోజు తీరలేదురా రాజసాన ఏలరా, మనసు నిలువ నీదురా మమత మాసిపోదురా,మధురమైన బాధరా మరపురాదు". ఈ పాటే అనార్కలీ చిత్రానికి కీలకమైంది. సముద్రాల రాఘవాచార్య అందించిన సాహిత్యాన్ని దీన్ని ఘంటసాల, జిక్కి ఆలపించారు. ఇదే పాటని 50 సంవత్సరాల తర్వాత లీడర్ సినిమాలో రీమిక్స్‌గా ఉపయోగించారు.

ఈ సినిమాలోదే జిక్కి పాడిన మరో పాట "జీవితమే సఫలము, రాగ సుధాభరితము ప్రేమ కథ మధురము, హాయిగా తీయగా ఆలపించు పాటల, వరాల సోయగాల పూల వలపు గొలుసు మాటల, అనారు పూల తోటల... ఆశ దెలుపు ఆటల జీవితమే సఫలము...'. ఈ పాటకు సాహిత్యం అందించింది సముద్రాల సీనియర్.

ఒక దగ్గర పని చేస్తున్నప్పుడు ఎవరికైనా ఎప్పుడంటే అప్పుడు, ఆ పనిని విడిచి బయటికి వెళ్ళడానికి కుదరదు. పని ఒత్తిడిలో ఉన్నప్పుడు తన చెలికాడు పిలిస్తే... వదిలి రాలేక, రానని చెప్పలేక సతమతమవుతుంది ఆ సుందరి. అలాంటి పరిస్థితిలో పాడే పాట ఏయన్నార్, అంజలి నటించిన 'సువర్ణ సుందరి' చిత్రంలోని "పిలువకురా అలుగకురా నలుగురిలో నన్ను ఓ రాజా... నలుగురిలో నను ఓ రాజా పలుచన సలుపకురా, మనసున బాలి మరువనులేరా, చలమున మోవిసలుపకు రాజా, సమయము కాదురా నను దరిచేరా". సముద్రాల రాఘవాచార్య అందించిన సాహితానికి పి.సుశీల గానం మరింత వన్నె తెచ్చింది. ఇదే చిత్రంలోని ఇంకో పాటని సముద్రాల రాఘవాచార్య సాహిత్యం అందించి, పి.జిక్కి, ఘంటసాల పాడిన పాట "హాయి హాయిగా ఆమని సాగే... సోయగాల

మూసుకున్నావా, సరిసరి వగలు తెలిసెర గడుసరి, పూజకు వేళాయెరా' వంటి పాటలన్నీ వినసొంపుగా, వీనులవిందుగా వుంటాయి.

బ్రిటీష్ దొరలు మన దేశంలో చేయని అకృత్యం లేదు. దోచుకోని ఊరు, వాడా లేదు. వారి నిరంకుశ పాలనను ఎదిరిస్తూ, ఈ దేశం మనదని నినదిస్తూ తెలుగు వారంతా ఒక్కటై బ్రిటీష్ సామ్రాజ్య వాదులను తరిమికొట్టాలని ప్రజలకు పిలునిచ్చే సందర్భంలో పాడే పాట కృష్ణ నటించిన 'అల్లూరి సీతారామరాజు' చిత్రంలోని "తెలుగు వీర లేవరా దీక్షబూని సాగరా... దేశమాత స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా... దారుణమారణ కాండకు తల్లడిల్ల వద్దురా, నీతిలేని శాసనాలు నేటినుండి రద్దురా". శ్రీశ్రీ రాసిన ఈ పాటని బాలసుబ్రహ్మణ్యం పాడారు. శ్రీశ్రీ ఈ పాటకి జాతీయ ఉత్తమ పాటల రచయితగా అవార్డు కూడా అందుకున్నారు.

ఈ చిత్రంలోదే మరో పాట 'వస్తాడు నా రాజు ఈ రోజు, రానె వస్తాడు నెలరాజు ఈ రోజు... కార్తీక పున్నమి వేళలోన కలికి వెన్నెల కెరటాలపైన తేలి". ప్రియుడి రాక కోసం ఎదురు చూసే ప్రేయసి పాడే ఈ పాట ఇది. సి.నారాయణరెడ్డి రాసిన ఈ పాటని పి.సుశీల పాడారు.

కృష్ణ, విజయ నిర్మల నటించిన 'మోసగాళ్ళకు మోసగాడు' చిత్రంలో బాలసుబ్రహ్మణ్యం, పి.సుశీల గానం చేసిన పాట "కోరినది నెరవేరినది ఒహో కలలు నిజమాయే... కోరినది దరి చేరినది అహా ఎదలు ఒకటాయే". సంగీత పరంగా ఆకట్టుకున్న ఈ పాటకు ఆరుద్ర సాహిత్యం అందించారు. ఇలా ఎన్నో ఆకట్టుకునే బాణీలతో మర్చిపోలేని మధురమైన సంగీతాన్ని అందించారు పి.నారాయణరావు.

- బి.మల్లేశ్వరి

నెమలీక

ఎవరు గొప్ప!

ఒక పాముకు అందరికంటే ఎవరు గొప్ప అని తెలుసుకోవాలనుకుంది. అంతలో ఓ ముంగిస దానికెదురుగా రావడంతో పాము భయపడింది. లోకంలో ముంగిసే గొప్పది అనుకుంటూ పక్కనే వున్న పొదలో దాక్కుంది. ముంగిసకు ఎదురుగా వేటకుక్క రావడంతో ముంగిస భయంతో పారిపోయింది. ఇది చూసిన పాము ముంగిస కంటే వేటకుక్కే గొప్పది అనుకుంది.

అంతలో కుక్క యజమాని అక్కడికి కోపంతో వచ్చి "నిన్ను అక్కడ వెతుకుతుంటే నువ్విక్కడేం చేస్తున్నావ్?" అంటూ కుక్కను కర్రతో బాదాడు. దాంతో కుక్క భయంతో పరుగెత్తింది. పొద చాటునుండి ఇదంతా చూస్తున్న పాము కుక్కకంటే మనిషి గొప్పవాడు అనుకుని పొదలోనుండి బయటికి వచ్చింది.

పామును చూసిన మనిషి భయంతో అరుస్తూ పరుగెత్తాడు. మళ్లీ పాము "అరె, ఇదేంటి? ఈ యజమాని నన్ను చూసి భయంతో పారిపోతున్నాడు. నేనేమో నాకుంటే ముంగిస, దానికంటే కుక్క, కుక్కంటే కూడా దాని యజమాని అయిన మనిషి చాలా గొప్పవాడనుకుంటున్నాను. ఇతనేమో ఇంత పిరికిగా పారిపోతున్నాడు. ఇతని కంటే నేనే ఎన్నో రెట్లు నయం. మొత్తానికి ఈ లోకంలో అందరికంటే నేనే గొప్పదాన్ని అనుకుంటూ ముందుకు పోయింది పాము.

దేశాల పేర్లు?

కనిపిస్తున్న స్టాంపుల్లో మూడు దేశాలకు సంబంధించిన వారు సంప్రదాయ దుస్తుల్లో వున్నారు. వారు ఏ దేశాలకు చెందినవారో గుర్తించండి.

[illegible]

దారేది?

బాబుకు బాగా ఆకలిగా వుంది. వెళ్ళి ఆపిల్ తీసుకుని తినాలంటే ఏ దారిలో వెళ్ళాలి?



ఒక్క పాము

ఇక్కడున్న పదకొండు పాముల్లో అన్నీ కవలలే. ఒక్కటి తప్ప. ఆ ఒక్కదాన్ని గుర్తుపట్టి సున్నా చుట్టండి.

నీడ ఎవరిది?

నీడలో దాగున్న జంతువులను గుర్తుపట్టారా?



జల సంధులు

పాక్ జలసంధి : భారత్, శ్రీలంకను కలుపుతుంది.

బేరింగ్ జలసంధి : ఇది ఈశాన్య ఆఫ్రికాలోని సైబీరియాను, ఉత్తర అమెరికాలో వాయువ్య ప్రాంతమైన అలస్కాను కలుపుతుంది.

డేవిస్ జలసంధి : ఇది గ్రీన్‌లాండ్, లాబ్రాడర్ ప్రాంతాలను కలుపుతుంది. ఇదే అతి పెద్ద జలసంధి.

బాస్ జలసంధి : ఇది ఆస్ట్రేలియా, టాస్మేనియా దీవులను కలుపుతుంది.

సుండా జలసంధి : సుమత్రా దీవుల మధ్య ఉన్న జావా సముద్రాన్ని, హిందూ మహాసముద్రాన్ని కలుపుతుంది.

ఎన్నున్నాయో చెప్పండి

ఈ అడవిలో రకరకాల పక్షులున్నాయి. అవన్నీ ఎన్నున్నాయో లెక్కపెట్టండి.

విక్రమ్ సారాభాయ్

విక్రమ్ అంబాలాల్ సారాభాయ్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 1919, ఆగస్టు 12న జన్మించారు. భారతీయ అంతరిక్ష పరిశోధన ఏర్పాటు అవసరాలను అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు వివరించి, ఆయన్ని ఒప్పించారు. వాటి విజయాలకూ కీలకమైన వ్యక్తి డా॥ విక్రమ్ సారాభాయ్. చిన్న చిన్న రాకెట్ల నుంచి అతి పెద్ద రాకెట్ ప్రయోగ వాహన నౌకలు, ఉపగ్రహాలు, ప్రయోగించే దశకు భారత్ ఎదిగడానికి సారాభాయ్ నిరంతర పరిశోధనలు, దీక్ష, కృషి కారణమంటే అతిశయోక్తికాదు.

అంతరిక్ష పరిశోధనలు దేశావసరాలైన విద్య, కమ్యూనికేషన్స్, భూగర్భ వనరులు, రక్షణ, వాతావరణ పరిశోధన మొదలైన రంగాలలో ఉపయోగ పడే విధంగా రూపకల్పన చేశారు.

1975లో భారతదేశపు మొదటి ఉపగ్రహం 'ఆర్యభట్ట' సోవియట్ దేశం నుండి ప్రయోగించారు. దీని రూపకర్త సారాభాయ్. వీరిని పద్మవిభూషణ్ బిరుదుతో భారతప్రభుత్వం సత్కరించింది. సారాభాయ్ 'ఇస్రో' అధినేతగా కూడా పనిచేశారు. దానిని మేటి సంస్థగా తీర్చిదిద్దారు.

పుట్టిన అరగంటకే...

- ★ జింకను లేడి, దుప్పి అని కూడా పిలుస్తారు.
- ★ మగ జింకలకు కొమ్ములుంటాయి. ఇవి ప్రతి సంవత్సరం పెరుగుతూనే వుంటాయి.
- ★ కొన్ని జింకలు ఒకేలా కనిపించినా వాటి కొమ్ములు తేడాగా ఉంటాయి.
- ★ జింకలు ఆహారాన్వేషణలో కొమ్ములను ఉపయోగిస్తాయి.
- ★ ఆడ జింకలను ఆకర్షించడానికి కూడా మగ జింకలు తమ కొమ్ములను ప్రదర్శిస్తాయి.
- ★ జింకలలో జాతులకు బట్టి వాటి శరీరం మీద తెల్ల చుక్కలు వుంటాయి.
- ★ జింకలకు పుట్టుకతో శరీరం మీద తెల్ల చుక్కలుంటాయి. కానీ పెరిగే కొద్దీ అవి మాయమవుతాయి.
- ★ ఇవి పుట్టిన అరగంటకే నడవడం మొదలుపెడతాయి.
- ★ జింక పిల్లలు సంవత్సరం వరకు తల్లిని అంటిపెట్టుకునే ఉంటాయి.
- ★ ఇవి చాలా ఎత్తుకు ఎగరగలవు, నీళ్ళల్లో ఈదగలవు కూడా.
- ★ ఇవి శత్రువుల బారి నుండి తమను తాము కాపాడుకోడానికి ఎలా పడితే అలా అడ్డదిడ్డంగా పరిగెడతాయి.
- ★ వీటి కాళ్ళు సన్నగా ఉన్నాకూడా చాలా బలంగా వుంటాయి.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

పారిస్, జూన్ 1848

ఆ నాటికి పారిస్‌లోని స్త్రీ, పురుషులందరూ సాయుధులయ్యారని ఒక నానుడి ప్రచారంలో ఉంది. వర్గ వైషమ్యాలు తారా స్థాయికి చేరాయి. ఇక సామరస్యానికి అవకాశమే లేదు. ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైంది. ఆహార కొరత తీవ్రమైంది. అన్నార్తుల సంఖ్య పెరిగింది. వీధుల్లో గుమిగూడిన జనం వేసిన ఆకలి కేకలు మిన్నంటాయి. కార్మికులంతా కలిసి జూన్‌లో ఒక విందు కోసం ఏర్పాట్లు చేస్తున్నారని మే నెలలోనే వదంతులు ప్రచారమయ్యాయి. 'విందు' అంటే 'తిరుగుబాటే' అని స్పష్టమవుతూనే ఉంది. అయితే చివరికి తిరుగుబాటుకు కారణమైంది విందుకాదు. లామర్టైన్ ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ భద్రతా పథకాన్ని ఉపసంహరించుకోవాలని నేషనల్ అసెంబ్లీ కమిటీ నిర్ణయించింది. అసెంబ్లీ సభ్యుడైన విక్టర్ హ్యూగో (ప్రముఖ ఫ్రెంచి నవలా రచయిత) ఈ నిర్ణయం వల్ల 'ముష్టివాళ్ల సైన్యం' తయారవుతుందన్నారు. వీళ్లను అణచటానికి "నియంతలు తమ సైన్యాన్ని పురికొల్పుతారు". కాని ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. అందువల్ల



పారిస్ నేషనల్ అసెంబ్లీ సభ్యుల సమావేశం

ఉద్యోగ పథకంలో కోతలు పెట్టక తప్పలేదు. ఇదే ఈ ప్రభుత్వ వ్యతిరేక రాడికల్స్‌కు ఆయుధంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వర్కుషాపులున్నాయి గాని వీటిని కూడా ఎప్పుడు మూసేస్తారో తెలియదు. డబ్బుల్లేవని ప్రభుత్వం చేతులెత్తేసింది. లక్ష కుటుంబాలు రోడ్డున పడటం ఖాయం. ప్రజల ఆందోళనకు ఆజ్యం పోస్తూ వర్కుషాపులను మూసేస్తారనే ప్రచారం జరిగింది. ఇంకేముంది నిరసనలు పెల్లుబికాయి. 'బుల్లెట్స్ ఆర్ బ్రెడ్', 'బుల్లెట్స్ ఆర్ వర్క్' నినాదాలు మార్మోగాయి. నగరమంతా బారికేడ్లు మళ్లీ దర్శనమిచ్చాయి. జూన్ 23 నాటి పారిస్‌లోని ఒక ప్రాంతం కార్మికుల అధీనమైంది. జూన్ 24 నాడు, అల్జీరియా మాజీ నియంత, యుద్ధ మంత్రి జనరల్ లూయీ యూజీన్ కవానాక్ ఎదురు దాడి ప్రారంభించాడు.

ఆ రోజు తుఫాను గాలి, భీకర వర్షంతో తడిసిపోయింది పారిస్. అయినా యుద్ధం ఆగలేదు. సాయంత్రం ఆరింటి నుండి శతఘ్నులు భవనాల మీద, బారికేడ్ల మీద గుళ్ల వర్షం కురిపించాయి. స్త్రీ పురుషులనే తేడా లేకుండా ఎక్కడివాళ్లక్కడే నేలకొరిగారు. వీధుల్లో పరచిన రాళ్లమీద నెత్తురు వరదగా పారింది. ఇళ్ల ముందరి భాగాలు శతఘ్ని గోళాల తాకిడికి తుత్తునియలైనాయి. ఎక్కడ చూసినా కూలిన భవనాల రాతి, మట్టి దిబ్బలే. దుకాణాల గాజు కిటికీలు పగిలిపోయాయి. లోపలి వస్తువుల్ని ఎవరికి కావలసింది వాళ్లు తీసుకుని పోవచ్చు – మృత్యుభయం సర్వత్రా వ్యాపించిన ఆ రాత్రి పారిస్ వీధుల్లోకి అడుగిడగలిగిన ధైర్యవంతులదే ఆ సంపద! యుద్ధం మొదటిరోజునే, నేషనల్ అసెంబ్లీ, తన శాసనాధికారాలన్నీ కవానాక్‌కు బదలాయించింది. ఆనాటి ఫ్రెంచి ప్రజాస్వామిక రాజకీయ నాయకులకు, కార్మికుల తిరుగుబాటుకున్న నియంతపాలనే మెరుగనిపించింది. కాని కవానాక్‌కు కొత్తగా సంక్రమించిన అధికారాలతో కార్మికులు బెదిరిపోలేదు సరికదా, మరింత రెచ్చిపోయారు. రోజురోజుకూ తీవ్రతరమైంది సంగ్రామం.

లక్షలాది మంది స్త్రీ, పురుషులు వీధి యుద్ధాల్లో పాల్గొన్నారు. "మిలిటరీ అనుభవం లేకపోయినా అత్యంత చాకచక్యంగా యుద్ధం చేశారు. వీళ్ల పోరాట పటిమ ఏ సుశిక్షితులైన సైనికులకూ తీసిపోదు" అన్నాడు తుకెవిత్. మహిళలు ఆయుధాలు తయారు చేశారు. పురుషులు వాటిని ఉపయోగించారు. మగవాళ్లు అలసిపోయినప్పుడు, మరణించినప్పుడూ, స్త్రీలు స్వయంగా సమరంలో పాల్గొన్నారు. చిన్న పిల్లలు వాళ్లకు సాయం చేశారు. నాలుగు రోజుల పాటు చెలరేగిన భీకర పోరాటంలో సైన్యాన్ని నిలువరించటానికి సర్వశక్తులా ప్రయత్నించారు తిరుగుబాటుదారులు.

జూన్ 26 నాటికి యుద్ధం పరిసమాప్తమైంది. కనీసం పదిహేను వందల మంది హతులయ్యారు. బారికేడ్లు ధ్వంసమైన తర్వాత కూడా సైనికుల హత్యాకాండ ఆగలేదు. తిరుగుబాటుదారులను వెదికి, వేటాడి మరీ చంపారు. ఆ వేట తర్వాత మృతుల సంఖ్య మూడు వేలకు పెరిగింది. పదిహేనువేల మందిని అరెస్టు చేశారు. నలభై అయిదువేల మందిని బలవంతంగా పశువుల మందల్లాగా అల్జీరియాకు తరలించారు. చాలా మందికి అక్కడికి వెళ్లటమంటే మరణశిక్షతో సమానం. ఇంతమందిని బలిగొన్న తర్వాత కూడా అసెంబ్లీ ఏ మాత్రం చలించలేదు.

కార్మికులను చిత్తుచిత్తుగా ఓడించిన కవానాక్, మార్షల్ లా విధించి, అధ్యక్ష భవనానికి సమీపంలో యాభైవేల మంది అశ్వికులను కాపలా పెట్టాడు. రాడికల్ క్లబ్బులను మూసేయించాడు. సత్ప్రవర్తన రుసుముగా 24,000 ఫ్రాంకులు చెల్లించిన పత్రికలకు మాత్రమే ప్రచురించగలిగే అవకాశమిచ్చాడు. చివరికి తిరుగుబాటుకు శిక్షగా కార్మికులందరికీ రోజువారీ పనిగంటల మీద పరిమితిని తొలగించాడు. ప్రజాస్వామ్య ప్రయోగం ముగిసింది. కమ్యూనిస్టు నాయకుడు లూయీ బ్లాంక్ ఇంగ్లాండుకు పారిపోయాడు. పని హక్కుల కోసం, సమానత్వం కోసం, ప్రాతినిధ్య హక్కు కోసం పోరాడిన వేలాది మంది జైలు పాలయ్యారు.

జూన్ 24న ప్రారంభించి, మార్క్స్ ప్రతిరోజూ ఈ పరిణామాలను తన పత్రికలో ప్రచురించాడు. విశేషమేమిటంటే మరే పత్రికా, ఈ విషయాలను, సంఘటనలను ఇంత త్వరగా, ఇంత సవిస్తారంగా ప్రచురించలేదు. ఈ వార్తా కథనాలతో అధికారవర్గాల్లో కలవరం మొదలైంది. ఫిబ్రవరి తిరుగుబాటు జరిగినప్పుడు, ఆ వార్తలు బెర్లిన్ చేరటానికి రోజులు పట్టింది. ఇప్పుడు గంటల వ్యవధిలో పత్రికల వాళ్లకు తెలిసిపోతున్నాయి. పారిస్ తిరుగుబాటు స్థానికంగా కూడా అల్లర్లకు దారితీస్తుందని ప్రభుత్వాలకు భయం మొదలైంది. అక్కడా ఇక్కడా ఒకే రకమైన వర్గవైషమ్యాలు, ఒకే రకమైన ఉద్రిక్త పరిస్థితులు. పరిస్థితి ఎప్పుడైనా చేతులు దాటొచ్చు.

జూన్ 26 నాటి పత్రిక మొత్తం కేవలం పారిస్ సంఘటనలకే కేటాయించాడు మార్క్స్. క్షణక్షణం ఉత్కంఠత రేకెత్తించింది ఆ కథనం :

"పారిస్ రక్తస్నానం చేసింది. తిరుగుబాటు చరిత్ర ఇంతవరకూ కనీవినీ ఎరుగని మహావిప్లవంగా పరిణమించబోతున్నది. బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోటెత్తిన కార్మిక విప్లవమిది." "ఇప్పటి వరకు జరిగిన తిరుగుబాట్లకూ దీనికీ తేడా వుంది. ఇప్పుడెవరికీ భ్రమలు లేవు. పార్టీ కోసం ప్రాణాలిస్తామనడం లేదు. జూన్ 23 నాడు కార్మికులు తమ ఉనికి కోసం పోరాడారు. వాళ్ల దృష్టిలో, ఇప్పుడు 'స్వదేశం' అనే మాటకు అర్థం లేదు" అన్నాడు ఎంగెల్స్.

"బూర్జువాలు దాచి ఉంచాలనుకున్న సామాజిక వాస్తవికతను బహిర్గతం చేసిందీ తిరుగుబాటు" అన్నాడు మార్క్స్. ఇప్పుడు స్పష్టమైంది. ఫ్రాన్సు ఒక్కదేశం కాదు రెండు దేశాలు. ఒకటి యజమానులదీ, మరొకటి పని వాళ్లదీ. ఫిబ్రవరిలో నినదించిన, జైలు గోడల మీదా, బారక్స్ గోడల మీదా రాసిన 'సోదరభావం' అనే మాట పెద్ద బూటకం. ఫిబ్రవరిలో జరిగింది మర్యాదస్తుల విప్లవం. దానిపట్ల

అందరికీ సానుభూతి కలిగింది. 'సామాజిక న్యాయం' అనే మాట కవితాత్మకంగా ధ్వనించింది. జూన్‌లో జరిగింది పరువు మర్యాదలేని వాళ్ల అగ్లీ రివల్యూషన్, నాస్టీ రివల్యూషన్. ఇప్పుడు మాటల్లేవు. చేతలే ఉన్నాయి." జూన్‌లో జరిగింది – పెట్టుబడికీ, శ్రమశక్తికీ మధ్య జరిగిన అంతర్యుద్ధం. "దీర్ఘకాలిక కార్మిక పోరాటంలో అశువులు బాసిన త్యాగధనులు వీళ్లు" అంటూ మృతులకు నివాళి అర్పించాడు ఎంగెల్స్.

ఆ తర్వాత, కొద్ది రోజుల్లోనే పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. ఫిబ్రవరి విప్లవం ముగిసింది. కౌంటర్ రివల్యూషన్ (ప్రతీఘాత విప్లవం) ప్రారంభమైంది. తమ ఇష్టానికి వ్యతిరేకంగా సంస్కరణలు చేసిన రియాక్షనరీ శక్తులు జూలు విదిలించి తమ రాక్షస రూపం ప్రదర్శించాయి. కేవలం పారిస్‌లోనే కాదు, యూరోప్ అంతటా ప్రారంభమైందీ వికృతక్రీడ. న్యూరైనిష్ జైటుంగ్‌లో ఫ్రెంచి అమరవీరులకు మార్క్స్ శ్రద్ధాంజలి ప్రచురించిన తర్వాత పత్రిక ఆర్థిక సహాయం చేస్తున్న మధ్య తరగతి షేర్ హోల్డర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, అన్ని దేశాల బూర్జువా, పెటీ బూర్జువాలు పరాజితులైన కార్మికుల మీద దుష్ప్రచారం ప్రారంభించినప్పుడు, జర్మనీలో – ఒక రకంగా మొత్తం యూరోపులో – కార్మికుల పక్షం వహించింది మా పత్రిక అనే తృప్తి మిగిలింది" అన్నాడు ఎంగెల్స్.

జూన్ చివరి వారానికి లండన్, బ్రసెల్స్‌ల నుండి కమ్యూనిస్టు లీగ్ నాయకులు కొలోన్ చేరుకుని తదుపరి కార్యాచరణ కోసం సిద్ధంగా ఉన్నారు. కాని మార్క్స్ సంస్థనిక రద్దు చేయాల్సిందేనన్నాడు. జనం తమ డిమాండ్ల గురించి వీధుల్లో బహిరంగంగా నినాదాలు చేస్తున్నప్పుడు సాయుధులై ప్రదర్శనలు నిర్వహిస్తున్నప్పుడు ఇంకా రహస్య సంస్థ ఎందుకన్నది ఆయన వాదం. ప్రతి విషయంలోనూ తద్వ్యతిరేక లక్షణాన్ని (వైరుధ్యాన్ని) చూడగలిగే మార్క్స్, విప్లవ పరాజయంలోనే విప్లవ విజయ బీజాలున్నాయన్నాడు. కాని, ఆ అంతిమ విజయంలో రహస్య సంస్థల పాత్ర మాత్రం ఉండదు. చీకటిలో, నీడలలో నిలిచి ఉద్యమించవలసిన అవసరం లేదు. ఇప్పుడు జరగాల్సింది ప్రత్యక్ష, బహిరంగ సమరమే. కొంత అసమ్మతి వ్యక్తమైనా చర్చల అనంతరం అందరూ సంస్థను రద్దు చేయటానికి అంగీకరించారు. తమ ఉద్యమ ప్రచారానికి 'న్యూరైనిష్ జైటుంగ్'ను ఒక ఆయుధంగా వాడుకోవాలని కూడా తీర్మానించారు. జర్మనీలో తిరిగి పుంజుకుంటున్న సాంప్రదాయిక, రియాక్షనరీ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చెయ్యాలి.

జూన్ 2 నాటికి, మార్క్స్ మాజీ సహచరుడు కాంప్ హౌసెన్ నాయకత్వంలో ఉన్న ప్రభుత్వం స్థానంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. దీనివి కూడా ఉదారవాద పాలసీలే అయినప్పటికీ, "పేదరికం పోవాలంటే శాంతిభద్రతల్ని పరిరక్షించాలి. రాజ్యాంగబద్ధమైన రాజరికం వ్యవస్థ తిరిగి ఏర్పడాలి" అని ప్రకటించింది. రాజ్యాంగమైతే అమల్లోకి రాలేదు గాని, శాంతిభద్రతల పేరుతో ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. గాట్‌బాక్‌నూ మరో కార్మిక నాయకుణ్ణీ అరెస్టు చేసినట్టుగా రిపోర్టు చేసింది న్యూరైనిష్ జైటుంగ్. ఈ సందర్భంగా పోలీసు అధికారి ఒకరు తాగిన మత్తులో దురుసుగా ప్రవర్తించాడని కూడా పేర్కొంది. పత్రిక మీద న్యాయపరమైన చర్యలు తీసుకుంటానన్నాడా అధికారి.

జులై 6 నాడు అధికారులు మార్క్స్‌ను ప్రశ్నించారు. 10వ తేది నాడు కంపోజిటర్లను పిలిచి, రిపోర్టు రాసిన వ్యక్తి ఎవరో చెప్పమని ఒత్తిడి చేశారు. నెల తర్వాత న్యూరైనిష్ జైటుంగ్ సంపాదక వర్గాన్ని ఎటాక్ చెయ్యడం ప్రారంభించారు. కొలోన్ పోలీసులు భార్యా, ముగ్గురు పిల్లల్తో ఉంటున్న కార్ల్ షాపర్‌ను దేశం విడిచి వెళ్లమన్నారు. అతడు జర్మన్ పౌరుడే. అయినా విదేశీయుడని అతడిమీద అభియోగం మోపారు. మార్క్స్‌కు అర్థమైంది తన పౌరసత్వ సమస్య ఇంకా తేలలేదు. ప్రభుత్వం దృష్టిలో తనింకా విదేశీయుడే.

త్వరలోనే మార్క్స్ మిత్రులు, అనుయాయులందరికీ కొలోన్ ఒక ప్రమాదకరమైన నగరంగా మారింది. ఎప్పుడు పోలీసులు ఏ గొడవ సృష్టిస్తారో, ఎప్పుడు బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేస్తారోననే భయంతో వణికారు. యధేచ్ఛగా అరెస్టులు కొనసాగాయి. అప్పుడు కూడా అధికారులు రూల్సు పాటించలేదు. ఇంక అలాంటి మాటలకు అర్థమే లేదు. ఇచ్చిన హక్కుల్ని వెనక్కు తీసుకోవటంలోనే నిమగ్నమైంది ప్రష్యన్ అసెంబ్లీ. అయినా రాజుగారికింకా తృప్తి లేదు. అసెంబ్లీ కాలయాపన చేస్తున్నదనే అనుకున్నాడు. రాజకీయ సంక్షోభం తర్వాత మూడవ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. "బుద్ధిలేని అడ్డగాడిదలు నాయకత్వం వహించిన కౌంటర్ రివల్యూషనరీ విజయం" అని వ్యాఖ్యానించాడు మార్క్స్.

ఎటు చూసినా రాజకీయ, సామాజిక గందరగోళమే కనిపించింది. కొత్తగా ఏర్పడిన ప్రతినిధుల సభలు అచేతనంగా పడి వుంటే, "శాంతిభద్రతల పరిరక్షకులు" పారిస్, బెర్లిన్, వియన్నా నగరాలలో ప్రజాస్వామిక వాదులతో వీధి యుద్ధాలు చేశారు. ఆకలి బాధలతో రెట్టింపైన కోపం, బాధ బద్దలయ్యే సమయం వచ్చింది. ఫిబ్రవరికి ముందు ప్రభుత్వం పేదల్ని విస్మరించింది. జూన్ తర్వాత వాళ్లకు గుర్తింపు వచ్చింది – కాని ఆ గుర్తింపువాళ్ల పట్ల పెరిగిన అపనమ్మకం, భయం మాత్రమే. ఉన్నత వర్గాల వాళ్లకు, పేదలంటే తృణీకారం, ద్వేషం. సానుభూతి అనే మాట లేదు. కార్మికుల్లో కూడా మార్పు వచ్చింది. ఎవర్నీ నమ్మకూడదు. ఎవరి మీదా ఆధారపడకూడదని తెలిసివచ్చింది. తమ హక్కుల్ని తామే రక్షించుకోవాలి. ఇంతవరకూ తాము పోరాటాలలో పరాజితులైన మాట నిజమే గాని, అనుభవంలో రాటుదేలారు. తమ పోరాట పటిమ తెలిసి వచ్చింది.

సెప్టెంబర్ 11, 1848 నాడు, కొలోన్‌లో తప్ప తాగిన సైనికులు ఒక యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించినప్పుడు స్థానిక సివిల్ గార్డ్ సభ్యులు వాళ్లను అడ్డుకున్నారు. ఆ తర్వాతి పోట్లాటలో కొందరికి కత్తి గాట్లయినాయి. నిజానికిది, స్థానిక అధిక సంఖ్యాక కాథలిక్కులకూ, ప్రొటెస్టెంట్ ప్రష్యన్ సైన్యానికీ మధ్య రాజుకుంటున్న గొడవలకు పరాకాష్ఠ.

రెండు రోజుల తర్వాత, ఆరువేల మంది స్థానికులు కొలోన్ చర్చి వెనక సమావేశమై 'ప్రజారక్షక దళం' ఏర్పాటు చేసుకున్నారు. కొంతవరకిందులో మార్క్స్ ప్రమేయముంది. ఆనాటి ఉదయం న్యూరైనిష్ జైటుంగ్ పౌరులందర్నీ సాయంత్రం చర్చి వద్దకు చేరుకొమ్మని పిలుపునిచ్చింది. ఆ సమావేశంలో, మార్క్స్, ఎంగెల్స్, మరో అయిదుగురు జైటుంగ్ సంపాదకులు కూడా పాల్గొన్నారు.

ఆ తర్వాతి ఆదివారం జర్మన్ నేషనల్ అసెంబ్లీ వున్న ఫ్రాంక్‌ఫర్ట్‌లో హింస చెలరేగింది(డెన్మార్క్‌తో కుదుర్చుకున్న ఒక ఒప్పందంలో జర్మనీకి అవమానం జరిగిందన్నది ఒక కారణం). నిరసన కారుల్ని అడ్డుకోవటానికి సైన్యం రంగంలోకి దిగింది. అయినా, నలభై ఎనిమిది గంటల దాకా పరిస్థితి అదుపులోకి రాలేదు.

న్యూరైనిష్ జైటుంగ్ నిరసన కారుల పట్ల సానుభూతి ప్రదర్శించింది. వాళ్ల కుటుంబాలను ఆదుకోవటానికి విరాళాలు పోగు చేసింది. "ఇది తాత్కాలిక పరాజయం. విముక్తి సాధించే దాకా ఈ వీరులు ఆయుధాలు దించరు. ఇక మీద రాజ భవనాలూ, ధనవంతుల బంగళాలే లక్ష్యంగా పోరాటం కొనసాగుతుంది" అని రాశాడు ఎంగెల్స్.

ఇది 'వార్తా కథనం' ముసుగేసుకున్న యుద్ధ ప్రకటన అనటంలో సందేహం లేదు. ఫ్రాంక్‌ఫర్ట్, కొలోన్‌లలోనే కాదు బెర్లిన్‌లో కూడా ప్రమాద ఘంటికలు మోగాయి. నాలుగు రోజుల తర్వాత మార్క్స్ మాటల్లో "తీరని అరెస్టుల దాహంతో స్పందించారు పోలీసులు". తెల్లవారేలోగా పత్రికా సిబ్బంది ఇద్దర్ని అరెస్టు చేశారు. "పరిస్థితి ఇలాగే కొనసాగితే పత్రిక కార్యకలాపాలెలా కొనసాగుతాయి? ఈ కవ్వింపు చర్యల్లో ఎవరు గెలుస్తారో చూద్దాం. ప్రభుత్వమా? మా పత్రికా సంపాదకులా?"

సోమవారం నాటి అరెస్టుల విషయం తెలిసి హింస చెలరేగింది. లూటీలు, పోలీసులతో ఘర్షణలు, పగిలిపోయిన గ్యాస్‌లైట్లు. కొలోన్ నిండా పరచుకున్న గాజు పెంకులు. సాయంత్రం వరకు జనంతో నిండిపోయాయి వీధులు. నలభై బారికేడ్లు నిర్మించారు. ఆయుధాల షాపులు, ఇనప సామాను షాపులు లూటీ చేసి ఖడ్గాలు, గొడ్డళ్లు ఒకటేమిటి, ఏది దొరికితే అదే తీసుకెళ్లారు నిరసనకారులు.

మరునాటి మధ్యాహ్నం వరకు కొలోన్ నగరం 'ముట్టడి'లో ఉన్నట్టుగా ప్రకటించింది ప్రభుత్వం. కార్మికులకిక యుద్ధం చేసే అవకాశం చేజారిపోయింది. కొత్త నిబంధనల ప్రకారం 'సివిల్‌గార్డు'కు ఇప్పుడే అధికారాలూ లేవు. మద్యశాలల్ని రాత్రి పదింటికి మూసెయ్యాలని ఆజ్ఞలు జారీ అయ్యాయి. సమావేశాల మీదా, న్యూరైనిష్ జైటుంగ్, 'మరో నాలుగు వార్తా పత్రికల మీదా నిషేధం విధించారు. 'ఖడ్గం ముందు తలవంచింది కలం' అంటూ చందాదారులకు కరపత్రం విడుదల చేశారు మార్క్స్. అయినా ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగదులే" అని ఒక ధీమా.

(సశేషం)

■ ప్రత్యేక వ్యాసం

తెలంగాణ సాహిత్య విమర్శ: పరామర్శ

వాస్తవానికి, 1970 దశకం వరకు తెలంగాణలో సాహిత్యమే లేదనే ఆధిపత్య భావన చెలామణి అవుతూ వచ్చింది. సాహిత్యమే లేనప్పుడు సాహిత్య విమర్శ ప్రస్తావన చేయడం సాహసమే అవుతుందనే అభిప్రాయం కూడా బలంగానే ఉండవచ్చు. అయితే, తెలంగాణ పరిశోధకులు, విమర్శకులు తమను తెలుసుకునే క్రమంలో తవ్వకాలు ప్రారంభిస్తూ వస్తున్నారు. దానివల్ల, తెలంగాణలో ప్రాచీన సాహిత్యం దండిగానే ఉందని, ఆధునిక వచన సాహిత్యం కూడా చాలా ముందుగానే ఉనికిలోకి వచ్చిందనే విషయం వెలుగులోకి వచ్చింది. అట్లాగే, తెలంగాణ సాహిత్య విమర్శకు కూడా చాలా చరిత్ర ఉందనే విషయం అర్థమవుతూ వచ్చింది. ఈ సందర్భంలో తెలంగాణ సాహిత్య విమర్శ అనే అంశాన్ని ఎలా చూడాలనే విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు స్థూలంగా మూడు రకాలుగా విభజించుకోవచ్చు. ఈ విభజన సాహిత్య విమర్శను సులభరీతిలో విశ్లేషించడానికి పనికి వచ్చేది మాత్రమే గానీ రూఢి చేయలేం.

ఆ రకంగా చూసినప్పుడు – 1. తెలంగాణ సాహిత్య విమర్శకులు చేసిన సాహిత్య విమర్శ 2. తెలంగాణ సాహిత్యంపై వచ్చిన విమర్శ 3. తెలంగాణ అస్తిత్వకోణంలో వెలువడిన విమర్శ అనే మూడు రకాలుగా విభజించుకోవచ్చు.

ఆధునిక కాలంలోకి వస్తే పరిశోధన, విమర్శ కలగలిసిన స్థితి కనిపిస్తుంది. సురవరం ప్రతాపరెడ్డి, కొమర్రాజు లక్ష్మణరావు, మానవల్లి రామకృష్ణ కవి, శేషాద్రి రమణకవులు, ఆదిరాజు వీరభద్ర రావు తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన పరిశోధన, విమర్శ సాగించారు. వీరిలో సురవరం ప్రతాప రెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు మినహా మిగతా వాళ్లు ఆంధ్ర ప్రాంతంవారే. శేషాద్రి రమణ కవులు పరిశోధన విషయంలో చేసిన కృషి తెలంగాణ ప్రాంతం ఎన్నటికీ మరిచిపోనిది. వీరి పరిశోధనకు, విమర్శకు సురవరం ప్రతాపరెడ్డి నడిపిన గోలకొండ పత్రిక కేంద్ర బిందువుగా ఉంటూ వచ్చింది.

తెలంగాణ నుంచి వచ్చిన బిరుదురాజు రామరాజు, పల్లా దుర్గయ్య, సి. నారాయణ రెడ్డి, కె. గోపాలకృష్ణా రావు, ఎం. కులశేఖర రావు, పి. యశోదారెడ్డి, ఇరివెంటి కృష్ణమూర్తి, వల్లపురెడ్డి బుచ్చారెడ్డి, ముకురాల రామారెడ్డి తెలుగు విమర్శనాసాహిత్యాన్ని అందించారు. బిరుదురాజు రామరాజు జానపద వాఙ్మయ పరిశోధనకు, విశ్లేషణకు, విమర్శకు ఆద్యుడిగా నిలుస్తారు.

సి. నారాయణరెడ్డి 'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు' అనే సిద్ధాంత గ్రంథం తెలుగు సాహిత్యంలో ఉన్నతమైన విమర్శ. అయితే, ఇది ఆంధ్ర సాహిత్య విమర్శనాసూత్రాలకు, కొలమానాలకు, భావనలకు అనుగుణంగా వచ్చిన విమర్శ. తెలంగాణ సాహిత్యాన్ని పరిగణనలోకి తీసుకునే ప్రయత్నం ఇందులో చాలా తక్కువగా జరిగింది. అయితే, ఈ గ్రంథాన్ని తెలంగాణ సమాజం సొంతం చేసుకోవాలా, వద్దా అనేది ప్రశ్నించుకోవాల్సిందే.

ముదిగంటి సుజాతారెడ్డి తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంలో తెలంగాణ సాహిత్యానికి తగిన స్థానం కల్పించారు. కానీ, ఆమె చేసిన ప్రయత్నం కూడా తెలంగాణ సాహిత్యాన్ని విస్మరణ నుంచి బయటపడేయలేకపోయింది. వరవర రావు తెలంగాణ విమోచనోద్యమ నవలలపై చేసిన పరిశోధన ఇప్పటికి కూడా ప్రామాణికమైందే. మార్క్సిస్టు దృక్పథంతో తెలంగాణ విమోచనోద్యమ నవలలను ఆయన విమర్శించారు. అయితే, ఇప్పటి ప్రత్యేక పరిస్థితిలో, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన స్థితిలో తెలంగాణేతరులు రాసిన తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో ప్రతిఫలించిన నిర్దిష్టత, సృజనాత్మక విలువల గురించి అధ్యయనం చేయాల్సి ఉంది. తెలంగాణ నుంచి వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన 'ప్రజల మనిషి', 'గంగు' నవలలతో వాటిని వస్తుశైలీ విషయాల్లో తులనాత్మక అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

ఎన్ గోపి 'ప్రజాకవి వేమన' పరిశోధనా గ్రంథం ఇతరులకు సాధ్యమయ్యేది కాదు. పరిశోధన, విమర్శన, పరిశీలన కలగలిసి అత్యుత్తమ గ్రంథంగా అది తెలుగు సాహిత్యానికి అందింది. ప్రజాకవి వేమనపై అంత విస్తృతమైన, సాధికారికమైన విమర్శ గ్రంథం మరోటి రాలేదంటే అతిశయోక్తి కాదు.

విప్లవ సాహిత్యం పైచేయి సాధించిన తర్వాత తెలుగు కథకు ప్రాధాన్యం వచ్చింది. తెలుగు సాహిత్యం తెలంగాణ సాహిత్యాన్ని తనలోకి తీసుకున్న సందర్భాలు రెండు మాత్రమే ఉన్నాయి. ఒకటి – తెలంగాణ సాయుధ పోరాట సాహిత్య సందర్భం, రెండోది – విప్లవ సాహిత్య సందర్భం. రెండో సందర్భంలోనే అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమ రెడ్డి కథలపై విస్తృతమైన చర్చనే జరిగింది. అల్లం రాజయ్య కథల్లోని భాష పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చిన వ్యాసాలు చాలానే ఉన్నాయి. గురజాడ అప్పారావు నుంచి ఇప్పటి వరకు కోస్తాంధ్ర భాష ప్రయోగం విషయంలో తలెత్తని వివాదం తెలంగాణ భాషా ప్రయోగం విషయంలో తలెత్తింది. వస్తువును అంగీకరిస్తూ, భాషను వ్యతిరేకించే ధోరణి కనిపిస్తూ వచ్చింది.

తుమ్మేటి రఘోత్తమ రెడ్డి 'పనిపిల్ల' కథపై పెద్ద యెత్తున చర్చ జరిగింది. ఈ చర్చలో పాల్గొన్నవారు చాలా మంది తెలంగాణకు చెందినవారే. ఈ కథను ఆలంబనగా చేసుకుని సిద్ధాంత చర్చ జరిగింది. వస్తువును రచయిత నిర్వహించిన తీరుపై అభ్యంతరాలు, సమర్థనలు ముందుకు వచ్చాయి. తెలంగాణ నుంచి విరివిగా విప్లవ కవిత్వం వచ్చినప్పటికీ పెద్దగా దానిపై విమర్శ వచ్చినట్లు లేదు. సమీక్షల వరకే అవి పరిమితమైనట్లు ఉంది. ఇదే సమయంలో అనుమాండ్ల భూమయ్య, కోవెల సంపత్కుమారాచార్య, కోవెల సుప్రసన్నాచార్య సంప్రదాయ విమర్శను ముందుకు నడిపించారు. కెకె రంగనాథాచార్యులు తెలుగు సాహిత్య విమర్శను సామాజిక దృక్కోణం నుంచి, తెలుగు సామాజిక పరిణామాల నేపథ్యం నుంచి విశ్లేషించారు.

దళిత, ముస్లిం సాహిత్య విమర్శలో తెలంగాణవాళ్లదే పైచేయి. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి 'బహువచనం' దళిత, బహుజన కవిత్వ సంకలనానికి, 'జల్‌జలా' ముస్లిం కవితా సంకలనానికి రాసిన ముందు మాటలు సాహిత్య విమర్శనా సాహిత్యంలో అత్యంత ప్రధానమైనవి. కె.

శ్రీనివాస్, సురేంద్ర రాజు, కాసుల ప్రతాపరెడ్డి దళిత, ముస్లిం సాహిత్య విమర్శనా రంగంలో విశేషమైన కృషి చేశారు. బిఎస్ రాములుకు సంబంధించి దళిత సాహిత్య విమర్శనా రంగంలో ప్రత్యేకమైంది.

1990 దశకం చివరి నుంచి విమర్శలో తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ కోణం ప్రారంభమై, బలపడుతూ వచ్చింది.ముదిగంటి సుజాతారెడ్డి, బిఎస్ రాములు, కాలువ మల్లయ్య, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, సురేంద్ర రాజు, కె. శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, గుడిపాటి తొలుత ఈ ప్రాంతీయ కోణాన్ని ఆవిష్కరించినవారు. వీరందరూ విడివిడిగా వ్యాసాలు రాస్తూనే వచ్చారు. తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన సదస్సుల్లో ప్రసంగాలు చేస్తూ వచ్చారు. తెలంగాణ కోణంలో సాహిత్య విమర్శ ఎలా ఉండాలి, దానికి గీటురాళ్లు ఏమిటి, ఇది కోస్తాంధ్ర సాహిత్య విమర్శ కన్నా భిన్నంగా ఎలా ఉంటుందనే విషయాలకు వారు సమాధానాలు వెతుకుతూ తెలంగాణ సాహిత్య ప్రపంచంతో పంచుకోవడం ప్రారంభించారు. అయితే, ఆ ప్రశ్నలకు సమాధానాలను వెతుకుతూ, లభించిన సమాధానాలతో ఒక నిర్దిష్టమైన ఆకారం ఇచ్చింది మాత్రం తెలంగాణ సాంస్కృతిక వేదిక తెచ్చిన 'తెలంగాణ తోవలు' పుస్తకం. ఇందులోని 18 మంది సాహిత్యవేత్తలు కూడా వివిధ అంశాలను తడుముతూ తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, చారిత్రక అంశాలను తెలంగాణ కోణం నుంచి ఎలా విశ్లేషించాలో, పునర్మూల్యాంకనం ఎలా చేయాలో నిర్దిష్టంగానూ నిర్దుష్టంగానూ చెప్పారు. తెలంగాణకు సంబంధించి కొత్త ప్రతీకలను నిలిపే ప్రయత్నం కూడా చేశారు. ఆ ఆలోచనాధార తెలంగాణ సాహిత్య, సాంస్కృతికోద్యమానికి మాత్రమే కాకుండా రాజకీయ ఉద్యమానికి కూడా దోహదం చేసింది. అదే సమయంలో వచ్చిన 'భౌగోళిక సందర్భం' పుస్తకంలోని వ్యాసాలు అప్పటికే ఆ కోణంలో రేఖామాత్రంగా విశ్లేషించినవి. ఒక గుడిపాటి 'ఫాయిదా' విమర్శనాగ్రంథంలోని వ్యాసాలు తెలంగాణ కోణంలో సాహిత్య విమర్శను ముందుకు తీసుకుని వెళ్లింది.

సంగిశెట్టి శ్రీనివాస్ 'దస్త్రమ్' పుస్తకం తెలంగాణ కథా స్వరూపాన్ని పట్టుకోవడానికి పనికి వచ్చిన గ్రంథం. వట్టికోట ఆళ్వారుస్వామి వంటివారి మీద కె. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్ చేసిన కృషిని విశేషంగానే చెప్పుకోవాలి. ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ తొలితరం కథలకు రాసిన ముందుమాటలు ఆ కథలను విశ్లేషించాయి. తెలంగాణ కథ పట్ల జరుగుతున్న వివక్షపై ప్రధానంగా దృష్టి సారించి, తెలంగాణ కథను రేఖామాత్రంగా పరిచయం చేసే వ్యాసాలతో 'తెలంగాణ కథ – దేవులాట' అనే పుస్తకం వచ్చింది. సుజాతారెడ్డి వివిధ రచయితల వ్యాసాలతో తెచ్చిన 'ముద్దెర' తెలంగాణ సాహిత్యంలోని వివిధ ప్రక్రియలను విమర్శనాత్మకంగా పరిచయం చేసింది.

ఆ తర్వాత తెలంగాణ సాహిత్యంపై వరుసగా విమర్శనా వ్యాసాలు, వ్యాసాల సంకలనాలు వచ్చాయి. నందిని సిధారెడ్డి 'ఇగురు', కాసుల ప్రతాపరెడ్డి 'కొలుపు', 'ఇరుసు', సుంకిరెడ్డి 'గనుమ', కాసుల లింగారెడ్డి 'ఇరువాలు' వంటి పుస్తకాలు వచ్చాయి. బన్న ఐలయ్యవంటి వారు రాసిన వ్యాసాలు, తెచ్చిన పుస్తకాలు కూడా తెలంగాణ సాహిత్య విమర్శకు సాధికారితను తెచ్చి పెట్టాయి. భువనగిరి సదస్సులో సమర్పించిన పత్రాలతో తూర్పు మల్లారెడ్డి తెచ్చిన పుస్తకం తెలంగాణ సాహిత్య ప్రక్రియలను స్థిరపరిచి, మార్గాన్ని చదును చేయడానికి ఉపయోగపడింది. సుంకిరెడ్డి 'ముంగిలి' గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆయన సాధికారికంగా ప్రాచీన తెలంగాణ కవిత్వాన్ని తెలంగాణ సమాజం ముందు ఉంచారు. అది తెలంగాణ ప్రాచీన కవిత్వ విమర్శన ప్రాథమిక గ్రంథంగా నిలిచిపోయింది. కర్ర ఎల్లారెడ్డి నడిపిన 'తెలంగాణ' పత్రికలోని వ్యాసాల్లో కూడా సాహిత్య విమర్శనా వ్యాసాలున్నాయి.

తెలంగాణ నుంచి కూడా ఏ మాత్రం తక్కువ కాని సృజనాత్మక సాహిత్యం వెలువడిందని చాటడానికి తెలంగాణ విమర్శ ప్రయత్నం చేసింది. దానికి ముందు వివక్షను ప్రశ్నించింది. ఆ తర్వాత తానేమిటో చాటుకోవడానికి పరిశోధన, పరిశీలనలను తెలంగాణ చేపట్టింది. ఆ తర్వాత తెలంగాణ సాహిత్యం తెలంగాణేతర సాహిత్యానికి ఎలా భిన్నమైందో చాటుకోవడానికి ప్రయత్నం చేసింది.

తెలంగాణ నుంచి కూడా ఏ మాత్రం తక్కువ కాని సృజనాత్మక సాహిత్యం వెలువడిందని చాటడానికి తెలంగాణ విమర్శ ప్రయత్నం చేసింది. దానికి ముందు వివక్షను ప్రశ్నించింది. ఆ తర్వాత తానేమిటో చాటుకోవడానికి పరిశోధన, పరిశీలనలను తెలంగాణ చేపట్టింది.

తెలంగాణ సాహిత్య విమర్శ:

1. తెలంగాణ సృజనాత్మక సాహిత్యం ప్రత్యేక అస్తిత్వాన్ని, ప్రత్యేక లక్షణాన్ని తెలంగాణ సాహిత్య విమర్శ చాటింది.
2. సీమాంధ్ర సాహిత్యంలో తెలంగాణ సాహిత్యాన్ని తులనాత్మక అధ్యయనం చేయడం కూడా తెలంగాణ సాహిత్య విమర్శలో ఇమిడి ఉంది.
3. తెలంగాణ సాహిత్య విమర్శకు కొలమానాలు మారాలని చెప్పడమే కాకుండా ఏ కొలమానాల ప్రకారం తెలంగాణ సాహిత్యాన్ని చూడాలో నిదర్శనాపూర్వకంగా చెప్పింది.
4. తెలంగాణ అస్తిత్వ ఉద్యమ సాహిత్య విశ్లేషణను మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ సాహిత్యాన్ని కూడా విశ్లేషించింది.
5. సమాజానికంతటికీ, ప్రగతిశీల శక్తులకూ తెలంగాణ సాహిత్య ఎలా దారి చూపుతుందో వివరించింది.
6. తెలంగాణ సాహిత్యం కేవలం కేవలం 'భౌగోళిక తెలంగాణ' సాధన కోసం మాత్రమే వెలువడింది కాదు, దానికో ప్రాపంచిక దృక్పథం ఉందని నిరూపిస్తూ విశ్లేషిస్తూ విమర్శ వచ్చింది.
7. అత్యంత ప్రధానంగా స్థానీయ ఉద్యమం ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమానికి చోదకశక్తిగా ఎలా మారుతుందో చెప్పింది.
8. భిన్న సంస్కృతులను, ఆచారవ్యవహారాలను, ఆర్థిక వ్యవస్థలను, సామాజిక శ్రేణులను రద్దుచేసి, ఏకీకృత మార్కెట్ సంస్కృతిని నిలపడానికి ప్రపంచీకరణ శక్తివంతమైన ఆయుధంగా మారి, అగ్రదేశాల గుప్పిట్లోకి ప్రపంచంలోకి ఎలా వెళ్తుందో, దాన్ని ఎదుర్కునే ఆచరణాత్మక పనిముట్టుగా తెలంగాణ ప్రాంతీయ లేదా స్థానీయ ఉద్యమానికి ఎలా ఉందో వివరించింది.

ఇకపోతే, మరో విషయాన్ని ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవాలి. తెలుగు సాహిత్య చరిత్రలో యుగవిభజన తెలంగాణ సాహిత్యాన్ని విశ్లేషించడానికి, విమర్శించడానికి, బేరీజు వేయడానికి పనికి రాదని తెలంగాణ సాహిత్య విమర్శకులు, పరిశోధకులు గుర్తించడం. తెలుగు సాహిత్య యుగవిభజనలో తెలంగాణ సాహిత్యం ఇమడదు. ఆ ఎరుకతో తెలంగాణ సాహిత్య చరిత్ర ద్వారా సుంకిరెడ్డి నారాయణ రెడ్డి చేసి పెట్టాడు. తెలుగు సాహిత్య చరిత్ర లేదా తెలంగాణేతర సాహిత్య చరిత్ర ప్రాఙ్నన్నయ యుగం నుంచి ప్రారంభమైతే తెలంగాణ సాహిత్య చరిత్ర శాతవాహన యుగం నుంచి ప్రారంభమవుతుంది. ఈ రీత్యా తెలంగాణ సాహిత్య విమర్శకు సంబంధించి సమగ్రమైన గ్రంథం ఇంకా రావాల్సే ఉంది.

– కాసుల ప్రతాపరెడ్డి, 98480956375

■ వికాసం

ఓటమినీ స్వీకరించగలగాలి...!

విజయం చేకూరిన తర్వాత ఏర్పడిన మానసిక ఆనందంకన్నా, ఓటమి చవిచూసిన వ్యక్తిలోని మానసిక సంఘర్షణ ఎక్కువగా ఉంటుంది. అంటే ఓటమి అనేది మనిషిని భావోద్వేగానికీ, బాధకూ, వేదనకూ గురిచేస్తుంది. ఈ సందర్భంలో తీసుకునే ఒక మంచి నిర్ణయమే తిరిగి ఆ వ్యక్తి గెలుపోటములను కూడా నిర్దేశిస్తుంది. ఓటమి అనే పునాదిపైనే విజయమనే గోడలు పటిష్టంగా నిలువ గలుగుతాయి. కాబట్టి ఒకసారి ఓటమి ఎదురైనంత మాత్రాన కుంగి, పోవాల్సిన అవసరం లేదు. దానిని ఒక సవాల్‌గా స్వీకరిస్తే... దాని ద్వారా గుణపాఠం నేర్చుకుంటే ఓటమికి దారి తీసిన విషయాలు తెలుస్తాయి. అవే విజయానికి ప్రేరణగా నిలుస్తాయి.

'ఒకదారిలోంచి విజయం వస్తే.. వేయిదారుల్లోంచి ఆటంకాలు వస్తుంటాయి. అయినా ఆత్మస్థయిర్యంతో, ఆత్మ విశ్వాసంతో వాటికి ఎదుర్కొనేందుకు సిద్ధపడినప్పుడే అసలైన విజేతలుగా నిలువగలుగుతారు. ఏదో చేయాలని, ఏదో సాధించాలని, అనుకున్నది వెంటనే జరిగిపోవాలని ఆరాట పడుతుంటారు కొందరు. ఆ కృషిలో భాగంగా ఒకవేళ ఫలితం వ్యతిరేకంగా వస్తే... 'ఓటమి పాలయ్యా'మని బాధ పడుతుంటారు. కానీ ఎందుకు ఓడిపోయామన్న విషయంపైన మాత్రం దృష్టి సారించరు. ఇది గ్రహిస్తే గనుక అసలు ఓటమి భయమనేదే ఉండదు. విజయాన్ని ఇష్టపడినట్లు, విజయాన్ని స్వీకరించినట్లు, విజయాన్ని ఆహ్వానించినట్లు, విజయాన్ని ఆస్వాదించినట్లు, విజయాన్ని ప్రేమించినట్లు. ఓటమిని కూడా ఇష్టపడాలి. ఓటమిని కూడా ఆహ్వానించాలి. ఓటమిని కూడా ఆస్వాదించాలి. ఓటమిని కూడా ప్రేమించాలి. అంటే... విజయాన్నీ, ఓటమినీ సమదృష్టితో చూసినప్పుడు, సమభావంతో స్వీకరించినప్పుడు గెలుపోటముల బాధనేదే ఉండదు. అందుకే మనం ఆ దిశగా ఆలోచించాలనేది మానసిక నిపుణుల మాట.

ఓటమి అనేది అనేకసార్లు విజయం కంటే కూడా ఎక్కువ ప్రభావం చూపుతుంది. దాని లోతుపాతుల్ని పరిశీలిస్తే గనుక అపజయాలు ఎదురైన చోటే విజయ సౌధాలు ఎలా నిరించుకోవచ్చునో కూడా బోధపడుతుంది. ఎలాంటి ఓటమినీ చవిచూడని వ్యక్తి ఒక్కసారిగా ఓటమి పాలవగానే అతనిలో ఈర్ష్య, ద్వేషం, కోపం, బాధ, అహంకారం ఇలా అనేక రకాల ఇబ్బందులు, మానసిక సంఘర్షణలు తలెత్తడం గమనించవచ్చు. కానీ వాటిని అణచివేయకపోతే, వాటి ప్రభావానికి లోనైతే ఎదురైన ఓటమి నుంచి బయట పడటమనేది సాధ్యం కాకపోగా మరిన్ని ఆటంకాలు, ఓటములూ చవిచూడాల్సి రావచ్చు. కాబట్టి ఓటమిని అవమానంగానో, అవహేళగానో చూడకూడదు. దానినొక గుణపాఠంగా తీసుకొని విజయం సాధించే దిశగా ప్రయత్నించాలి. అలాగనీ గెలుపోటములను బలప్రయోగం ద్వారా సాధించాలనేదీ సరైంది కాదు. కృషివల్ల, శ్రమవల్ల వచ్చిన విజయాన్ని ఎవ్వరూ కాదనలేరు. ప్రయత్నించినప్పటికీ అనివార్యంగా వచ్చిపడిన ఓటమినీ ఎవ్వరూ ఆపలేరు. అంటే ఈ రెండింటిలో ఏది వచ్చినా, ఏది ఎదురైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నవారే అసలైన విజేతలుగా నిలుస్తారు.

ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోగానే సరిపోదు. అది సాధించే మార్గాలు తెలుసుకోవాలి. అందుకోసం పట్టుదలతో కృషి చేయాలి. ఈ సందర్భంగా ఎదురయ్యే ఆటంకాలను అధిగమించాలి. దీనికి ఎంతో ధైర్యం, ఆత్మ స్థయిర్యం కావాలి. చాలామంది తమ ఓటమికి కారణం పరిస్థితులనో, ఇతర వ్యక్తులనో సాకుగా చూపుతుంటారు. అరుదుగా ఎప్పుడోఒకసారి ఇలాంటివి నిజం కావచ్చునేమోగానీ అన్ని సందర్భాల్లోనూ, అన్ని విషయాల్లోనూ ఒక వ్యక్తి ఓటమికి అవి మాత్రమే కారణం అనుకోవడం అవగాహనా రాహిత్యమే అవుతుంది. మనిషిలో వ్యక్తిగత లోపాలు కూడా ఓటమికి దారితీయవచ్చు. బయటి పరిస్థితులు సానుకూలంగా ఉన్నా, సరైన వ్యక్తిత్వం లేనప్పుడు, సబ్జెక్టు తెలియనప్పుడు, విషయ పరిజ్ఞానం, భాషా పరిజ్ఞానం వంటివి లేనప్పుడు ఓటమి ఎదురవుతుంది. కాబట్టి వ్యక్తికి అంతర్గత శత్రువులుగా పనిచేసే ఇలాంటి విషయాల్లో అప్రమత్తత అవసరం.ఇప్పుడు చేయాల్సింది ఇంకాసేపటికనీ, రేపటికనీ, వాయిదాల మీదా వాయిదాలు వేస్తుంటారు కొందరు. చివరికీ పనిభారం పెరిగి ఏదీ చేయక ఓటమి పాలవుతుంటారు. కొందరు వాయిదా వేయరు కానీ చేయాల్సిన పనులన్నింటినీ నిరంతరం తల్చుకుంటూ మానసికంగా ఇబ్బంది పడుతుంటారు. పని ప్రారంభించకముందే అవుతుందో లేదో నన్న నెగెటివ్ ఫీలింగ్స్‌కు లోనవుతుంటారు. దీనివల్ల మనిషిలో నిరాశ, నిస్పృహ, ఆవహిస్తుంది. అన్నీ ఒకేసారి ఊహించుకుని అతిగా ఆలోచించడంవల్ల నీరసం ఏర్పడుతుంది. మానసిక స్థయిర్యాన్ని కోల్పోతారు. ఆత్మ విశ్వాసం దెబ్బ తింటుంది. ఆందోళన పెరిగిపోతుంది. సమగ్రంగా ఆలోచించే సామర్థ్యం కోల్పోతారు. కాబట్టి ప్రశాంతంగా ఆలోచించాలి. వాయిదా వేయకుండా పనిని ప్రణాళికాబద్ధంగా ఎలా పూర్తి చేయగలరో ఎవరికి వారు ఆలోచించుకోవాలి. ఒక పనిని పూర్తి చేయడంలో తీసుకునే స్వీయ నిర్ణయంవల్ల, ఆ పనిలో ఎదురైన ఓటమిని అధిగమించే ఆలోచనా శక్తి కూడా పెరుగుతుంది. కాబట్టి ఒక లక్ష్యం నెరవేరాలంటే విజయాన్నే కాదు, ఓటమినీ స్వీరించాలి.

- జావెద్



జోక్స్ కార్నర్

జన్మలో చూడలేదు



డాక్టర్ : మాట పడిపోయిన పేషెంట్ పరిస్థితి ఏంటి?

నర్స్ : ఇవాళ ఉదయం కొద్దిగా మాట్లాడానికి ప్రయత్నించాడు డాక్టర్.

డాక్టర్ : ఏం మాట్లాడాడు?

నర్స్ : ఇంత దరిద్రమైన హాస్పిటల్ నా జన్మలో చూడలేదన్నాడు.

జిరాక్స్

వెంగళప్ప : ఐదు దినపత్రికలు ఇవ్వండి.

షాపు యజమాని : ఐదు లేవండి. ఒక్కటే ఉంది.

వెంగళప్ప : సరే, ఉన్న ఆ ఒక్కటే ఇవ్వండి. దాన్నే జిరాక్స్ కాపీలు తీయించుకుంటాను.

ఇప్పుడే ఏం చెప్పలేను

డాక్టర్ : ఎంసెట్ పరీక్ష ఎలా రాశావు?

కొడుకు : పేపర్ చాలా క్రిటికల్‌గా వుంది నాన్నా. ఇప్పుడే ఏం చెప్పలేను.

వసూలు చెయ్యాలి

టీచర్ : (మంత్రి కొడుకుతో) వరదలొస్తే ఏం చేయాలి? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

మంత్రి కొడుకు : వెంటనే చందాలు వసూలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలి.

అబద్దం



లాయర్ : (కొడుకుతో) నువ్వు ఇప్పటికిప్పుడు ఒక అబద్దం చెప్పగలిగితే నీకు వంద రూపాయలు ఇస్తాను.

కొడుకు : అబద్దమా! అది మా ఇంటా వంటా లేదు. నువ్వు నాకు ఇస్తానన్న రెండు వందలు ఇచ్చెయ్.

ఉద్యోగం



పూజారి : ఉద్యోగానికి రెజ్యూమె పంపించావా?

కొడుకు : రెజ్యూమెతో పాటు మన గోత్రం, రాశి, నక్షత్రం కూడా రాసి పంపించాను నాన్నా.

ఎందుకు?

తండ్రి : నిన్ను ఎం.పి.సి గ్రూప్ తీసుకోమంటే నువ్వు బైపిసి గ్రూప్ ఎందుకు తీసుకున్నావ్?

కొడుకు : అమ్మ టీవీలో సీరియల్ పెట్టమంటే నువ్వెందుకు వార్తలు పెడతావ్?

ఎప్పుడైనా రావచ్చు



వాతావరణ శాఖాధికారి : పరీక్షా ఫలితాలు ఎప్పుడొస్తాయి?

కొడుకు : రాబోయే 48 గంటల్లో ఎప్పుడైనా రావొచ్చు.

ఎలాగో తెలియక



నీటి పారుదల శాఖాధికారి : కాలమెందుకు వృథా చేస్తావు?

కొడుకు : స్టోరేజ్ చేయడం ఎలాగో తెలియక!

రోజు విడిచి రోజు



పేకాట పాపారావు : జీవితంలో ఎప్పుడూ జూదం ఆడకురా. జూదంలో ఒకరోజు గెలిస్తే, మరో రోజు ఓడిపోతాం.

కొడుకు : అయితే రోజు విడిచి రోజు ఆడతాలే నాన్నా!

బహుమతి

హరీష్ : విరామం పోటీలు పెడితే ఎవరు బహుమతి గెలుచుకుంటారు?

సుధాకర్ : టీవీ ఛానల్ వాళ్లు.

ముందంజ

వివేక్ : ఫీజులు వసూలు చేయడంలో ఎవరు ముందంజలో ఉంటారు?

సందీప్ : కార్పొరేట్ విద్యాసంస్థలు.

పోలిక

వెంకట్ : స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర్నుండి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికల వాగ్దానాలను పరిశీలిస్తే కామన్‌గా ఉండే అంశం ఏది?

సుందర్ : ఊళ్ళలోకి నీళ్లు, రోడ్డు సౌకర్యాలు తెస్తామని చెప్పడం.

– ఆనంద్‌రెడ్డి

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

మీడియాలో సంచలనం... డ్రోన్ జర్నలిజం

ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక రంగంలోనూ, అనేక ఇతర రంగాల్లోనూ వినూత్నమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో జర్నలిజం యొక్క ఆవశ్యకత కూడా విపరీతంగా పెరిగిపోయింది. అనేక సరికొత్త మీడియా సంస్థలు, ఎలక్ట్రానిక్ ఛానళ్ళు పుట్టుకొచ్చాయి. సమాజానికి మీడియా నిజమైన నిలువుటద్దంగా మారింది. సామాన్య మానవుడి రోజువారీ సమస్యలకు పరిష్కారాన్ని చూపే నిజమైన వేదికగా జర్నలిజం రూపుదిద్దుకున్నది. జర్నలిజం అనగానే ముందుగా గుర్తొచ్చేది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా. ఇంకా చెప్పాలంటే తాజాగా వెబ్ జర్నలిజం. అయితే... ఇప్పుడు సరికొత్తగా డ్రోన్ జర్నలిజం రాబోతోంది. ఇప్పటివరకు విలేకర్లు న్యూస్ కవరేజ్‌కి పెన్, పేపర్, ఆడియో రికార్డర్, స్టిల్ కెమెరా, వీడియో కెమెరాలను వినియోగించారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారబోతోంది. గాల్లోకి ఎగిరే డ్రోన్ కెమెరాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ డ్రోన్‌లకు స్టిల్ కెమెరాలనే కాదు వీడియో కెమెరాలను కూడా అమర్చి రిమోట్లతో పనిచేయించే అవకాశం వుంది.

ఈ డ్రోన్స్‌ను మిలిటరీ ఆపరేషన్స్, సైనిక అవసరాలకు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ముఖ్యంగా విదేశాల్లో నిఘా అవసరాలకు కూడా వాడుతున్నారు. డ్రోన్ అంటే... రోబిటిక్ రంగంలో అత్యంత ఆధునాతన టెక్నాలజీతో రూపొందించబడిన పరికరం. ఒక్కమాటలో చెప్పాలంటే మానవ రహిత విమానం. ఈ మానవరహిత విమానాలు (డ్రోన్స్) వార్తా సేకరణలో భాగం కానున్నాయా? అంటే.. ఖచ్చితంగా ఇది సాధ్యమే.. అంటున్నారు అమెరికాలోని మిస్సోరీ వర్సిటీకి చెందిన జర్నలిజం ప్రొఫెసర్ బిల్‌అలెన్. జర్నలిజం విధులకు మానవ రహిత విమానాల వినియోగంపై ఆయన ప్రయోగాత్మక పరిశీలన జరిపారు. 'డ్రోన్‌లను సరిగ్గా వాడగలిగితే వార్తాసేకరణలో అవి జర్నలిస్టులకు బాగా ఉపయోగపడతాయి' అని బిల్ చెబుతున్నారు. ఈ మేరకు వర్సిటీలో జర్నలిజం కోర్సుల్లో సైన్స్ జర్నలిజం/డ్రోన్ జర్నలిజం అంశాన్ని భాగంగా చేసినట్లు కూడా ఆయన చెబుతున్నారు. ఇప్పటికే ప్రపంచంలో కొన్ని సంస్థలు డ్రోన్ జర్నలిజంపై పరిశోధనలు చేస్తున్నాయి. డ్రోన్‌ల ద్వారా ఈ మధ్యకాలంలో అమెరికాలో పుస్తకాలు డెలివరీ, మరికొన్ని కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. ఇలా మనకు పనులు వేగంగా చేసిపెట్టే సామర్థ్యం ఉన్న డ్రోన్‌లను జర్నలిజంకు ఉపయోగిస్తే ఎలా ఉంటుందనే చర్చ ఇప్పుడు ఊపందుకుంది. అయితే దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయని థాయ్‌లాండ్‌కు చెందిన ఫోటోగ్రాఫర్ సిథికోర్న్ వాంగ్యూడిటియమ్ ఘంటాపథంగా చెబుతున్నారు. థాయిలాండ్‌లో డ్రోన్‌లకు కెమెరాలను అమర్చి ఫోటోలు తీయడం ద్వారా గత రెండేళ్లలో థాయ్‌లాండ్ న్యూస్ ఫోటోగ్రఫీని ఎంతగా మార్చేసిందో ఆయన వెల్లడించారు. ముఖ్యంగా అల్లర్లు, ప్రకృతి విపత్తులు, తదితర సమయాల్లో డ్రోన్ జర్నలిజం ఎంతగానో ఉపయోగపడుతుందని, మతఘర్షణలు, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణకు డ్రోన్‌లను ఉపయోగించి ఫొటోలు తీయడంతో పాటు ఫొటోగ్రాఫర్లు తీసే ఫొటోలను కలిపి వాడుకుంటే మంచి ఫలితాలు వస్తాయని సిథికోర్న్ చెబుతున్నారు. హై యాంగిల్ షూటింగ్‌కు, పెద్దపెద్ద కార్యక్రమాలను పూర్తిగా కవరేజ్ చేయడానికి ఈ తరహా ఫొటోగ్రఫీ ఉపయోగపడుతుంది. హెలికాప్టర్ల ద్వారానూ ఇలా చేయవచ్చు కానీ తక్కువ యాంగిల్ నుంచి తీయడం కష్టం, అలాగే డబ్బు ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది.

తాజాగా ఇప్పుడు అమెరికాకు చెందిన ప్రముఖ మీడియా సంస్థ సిఎన్ఎన్ డ్రోన్ జర్నలిజంను పరీక్షించేందుకు సన్నాహాలు మొదలెట్టింది. పబ్లిక్ ర్యాలీలు, ఇతర మీటింగ్‌లు, ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు వంటి సందర్భాల్లో కెమెరామెన్‌లు నిర్వహించే క్లిష్టసాధ్యమైన పనులను ఈ డ్రోన్ కెమెరాలు సునాయాసంగా చేయగలవు. ఆకాశంలో ఎగురుతూ వస్తుంటాయి. రిమోట్లతో పనిచేస్తుంటాయి కాబట్టి కెమెరామెన్ కెమెరాల్లా వీటికి ప్రమాదాలు తక్కువే. ఇప్పటివరకు డ్రోన్ కెమెరాలను ప్రయోగాత్మకంగా వినియోగించారే తప్ప కమర్షియల్‌గా వాడలేదు. అందుకే అమెరికాలోని సిఎన్ఎన్ మీడియా గ్రూప్ ఫెడరల్ యావియేషన్ అడ్మినిస్ట్రేషన్‌తో ఒప్పందం చేసుకుంది. అయితే ఇలాంటి న్యూస్ కవరేజీకి అమెరికా సంయుక్తరాష్ట్రాలు అనుమతిస్తాయా? అనేది చూడాల్సివుంది.

డ్రోన్‌కు కెమెరా బిగించి చిత్రీకరించడం ఆర్మీ అవసరాలతో మొదలైంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో ల్యాండ్ అయింది. అటునుంచి లెజెండ్, ఆగడు, బాహుబలి వంటి సినిమాల లొకేషన్స్‌లో ఎగురుతూ.. టాలీవుడ్‌లోనూ అడుగుపెట్టింది. సిటీలో పెళ్లిళ్లు, ఫ్యాషన్ షోలలోనూ వీటిని వాడుతున్నారు. తమ వెంచర్ విశేషాలను కస్టమర్లకు చూపడానికి కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు కూడా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నాయి. భారీ పరిశ్రమల ఏరియల్ 'వ్యూ'కి సైతం ఇవి ఉపకరిస్తున్నాయి. నిన్నటివరకు ఆడుకునే డ్రోన్ నేడు వీడియోగ్రఫీలో ప్రధాన పాత్ర పోషించనున్నది. ఇవి తక్కువ శబ్దంతో, బ్యాటరీ ఆధారంగా నడుస్తాయి. చేతిలో ఉన్న రిమోట్ సూచనలకు అనుగుణంగా తిప్పుతూ అవసరమైన సీన్లు షూట్ చేసుకునే చాన్స్ ఉంది. స్క్రీన్ మీద వీటి గమనాన్ని వీక్షిస్తూ.. ల్యాప్‌టాప్, ఐపాడ్, టాబ్లెట్స్, మొబైల్స్ ద్వారా సైతం కదలికల్ని నియంత్రించవచ్చు.

భారీ కార్యక్రమాలు, ఆడియో ఫంక్షన్లు వంటి కార్యక్రమాలను చిత్రీకరించేందుకు ఇప్పటివరకూ క్రేన్స్‌ని వాడుతున్నారు. ఇప్పుడు క్రేన్స్‌కి డ్రోన్స్ చెక్ పెట్టనున్నాయి. తక్కువ ప్లేస్‌లో ఇమిడిపోవడం, సులభంగా ఆపరేట్ చేయగలగడం, ఖర్చు పరంగా చూసినా లాభమే కావడంతో.. పలువురు వీడియో గ్రాఫర్లు డ్రోన్ వాడకం పట్ల మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ముందుకూ వెనక్కూ కదిలే సౌలభ్యం ఉండటంతో జూమ్ చేయాల్సిన అవసరం లేకుండానే చిత్రీకరణ సాగిపోతుంది. అయితే డ్రోన్ ప్రయోగానికి పోలీసుల అనుమతి తప్పనిసరి. ప్రముఖులు ఉన్న ప్రదేశాల్లో వీటి వినియోగానికి అనుమతి లభించదు.

మనదేశంలో ఇప్పటివరకు పెళ్లిళ్లు, ఇతర చిన్నాచితక కార్యక్రమాల కవరేజీకి డ్రోన్‌లను వినియోగిస్తారు. ఎక్కడబడితే అక్కడ డ్రోన్‌లను వినియోగించేందుకు రూల్స్ ఒప్పుకోవు. కాబట్టి ఈ రకమైన ఫ్లైయింగ్ కెమెరాల రాకకు మరికొంతకాలం వేచిచూడక తప్పదు. ఇటీవల సిటీలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో డ్రోన్ వాడటం ద్వారా దేశంలోనే హైదరాబాద్ సరికొత్త ట్రెండ్‌కు నాంది పలికింది. జర్నలిజంలోనూ ఈ టెక్నాలజీ పూర్తిస్థాయిలో ప్రవేశిస్తే అద్భుత ఫలితాలు వస్తాయని నిపుణుల అంచనా. త్వరలోనే మరిన్ని రంగాలకు డ్రోన్స్ వాడకం విస్తరించనుంది.

రచయిత సెల్ : 9490099219

క్యాన్సర్‌కు హోమియో వైద్యం

క్యాన్సర్... ఈ పదం వింటేనే అంతులేని భయం, ఆందోళన. క్యాన్సర్ ఆనవాళ్లేవో ఉన్నట్లు తెలిసిందో లేదో, ఇక జీవితమే ముసిగిపోయిందన్న భావన. నిలకడ లేని మనసు. నిద్రలేని రాత్రులు. సరియైన చికిత్సే దొరకకపోవడం ఒక సమస్య అయితే, దొరికిన ఆ చికిత్సతో ఎన్నో దుష్ఫలితాలు. జీవితానికి ఏ మాత్రం భరోసాలేని వైనం. నిజానికి హోమియో చికిత్సతో క్యాన్సర్‌కు ఒక నమ్మకమైన పరిష్కారం చూపించవచ్చు అంటున్నారు ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ మధు వారణాశి.

వాస్తవానికి క్యాన్సర్ అనగానే అంత భయపడాల్సిన పనేమీ లేదు. సరియైన వైద్యుడు, సరియైన అవగాహన, సరియైన చికిత్స ఈ మూడింటి కలయికతో అత్యంత ఉత్తమమైన పరిష్కారం దొరకగలదు. కాన్సర్ గురించిన అవగాహనా లోపం వల్లే చాలామంది వ్యాధిని బాగా ముదర పెట్టుకుని ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా క్యాన్సర్ ఇంతగా ఎందుకు వ్యాపిస్తోంది? అన్నది నిజంగా ఒక పెద్ద ప్రశ్నగానే వుంది.



మన శరీరపు ఏ భాగంలోనైనా ఒక అసాధారణ రీతిలో కణజాలం పెరిగిపోవడాన్నే క్యాన్సర్ అంటాం. శరీరం మీద పడే కార్సినోజెన్ అనే పదార్థాలే కాన్సర్ రావడానికి ఒక మూల కారణంగా వుంటున్నాయి.

అందుకు దారితీసే ఇతర కాణాల్లోకి వెళితే పొగాకు ఉత్పత్తులు వాడకం, మద్యపానం, గుట్కా నమలడం, పాన్ పరాగ్, ఫాస్ట్‌ఫుడ్స్, అతిగా మాంసాహారం తీసుకోవడం, కలుషిత నీరు, కలుషితమైన గాలి, కొన్ని రకాల రసాయన పదార్థాల మధ్య వుండడం వంటివి, కొన్ని రకాల బహిష్టు సంబంధిత వ్యాధులు క్యాన్సర్ కారకంగా వుంటాయి. అన్నింటిలోకెల్లా పొగాకు వినియోగం కారణంగా క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్యే ఎక్కువ.

పొగాకు ప్రభావం

ప్రపంచ వ్యాప్తంగా 9 శాతం మంది ఈ పొగాకు దుష్ప్రభావాల కారణంగానే మృత్యువాత పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. పొగాకులో దాదాపు 4 వేల రకాల రసాయనాలు వున్నాయి. వీటి కారణంగా దీర్ఘకాలికంగా పొగతాగుతున్న వారిలో పలు రకాల దుష్ప్రభావాలు కనిపిస్తాయి. వీరిలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడం ఒక ప్రధాన సమస్య. ఈ కారణంగా శరీరం త్వరగా శక్తిహీనం కావడం, చర్మం వేగంగా ముడతలు పడడం, జుత్తు చిన్న వయసులోనే తెల్లబడడం, బట్టతల రావడం వంటి సమస్యలు వస్తాయి. వీటితో పాటు అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు తలెత్తుతాయి. పొగ తాగేవారిలో అత్యధికులు అంగస్తంభన లోపాలు, నపుంసకత్వం వంటి సమస్యలకు లోనవుతుంటారు. మరికొందరిలో రక్తనాళాల గోడలు దళసరిగా మారి, రక్తసరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీనివల్ల నడవడానికి అసౌకర్యంగా వుంటుంది. పొగ తాగడం వల్ల నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఈసోఫేగల్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ. అలాగే శ్వాసకోశాలు, క్లోమగ్రంధి, పెద్దపేగు, కిడ్నీ, మూత్రాశయ క్యాన్సర్లు కూడా ఎక్కువే వస్తాయి. పొగాకులో 19 రకాల క్యాన్సర్లకు దారి తీసే రసాయనాలు ఉన్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి.

బ్లడ్ క్యాన్సర్

సహజంగా శరీరంలో తెల్ల రక్త కణాలు నాలుగు వేల నుంచి 11 వేల దాకా వుంటాయి. బ్లడ్ క్యాన్సర్‌లో తెల్ల రక్తకణాలు లక్షల సంఖ్యలో పెరుగుతాయి. ఈ సమస్యను లుకేమియా అంటారు.

ప్రపంచ వ్యాప్తంగా నేడు ఏటా 10 లక్షల మంది బ్లడ్ క్యాన్సర్ బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. ఇది కేవలం తెల్లకణాలకు మాత్రమే వచ్చే సమస్య. లుకేమియాను అక్యూట్ అని, క్రానిక్ అనీ రెండు రకాలుగా వర్గీకరిస్తారు. వ్యాధి కారక కణాలు ఎక్కడి నుంచి ఉత్పత్తి అవుతున్నాయనే దాన్ని బట్టి దాని పేరు మారుతుంది. శరీరంలో ఏ భాగానికయినా క్యాన్సర్ వచ్చినప్పుడు రేడియేషన్ థెరపీ ఇస్తారు. వారిలో కొందరికి ఆ తరువాత కాలంలో ఈ లుకేమియా వచ్చే అవకాశం వుంది. అలాగే దీర్ఘకాలికంగా వాడే కొన్ని రకాల మందుల వల్ల, కొన్ని రకాల రసాయనాల వల్ల వారసత్వ మూలాల వల్ల కూడా లుకేమియా వచ్చే వీలుంది.

డా॥మధు వారణాశి ఎం.డి
ప్రముఖ హోమియో వైద్య నిపుణులు
ప్లాట్ నెం.188,
వివేకానంద నగర్ కాలనీ
కూకట్‌పల్లి, హైద్రాబాద్.
ఫోన్ : 8897331110,
8886509509

ఏ చిన్న గాయమైనా తీవ్రంగా రక్తస్రావం అవుతుంది. ఏ మాత్రం పని చేయకుండానే తీవ్రమైన అలసట. గొంతు నొప్పి, కడుపంతా బరువుగా అనిపించడం, ఎముకల్లో నొప్పి, తరచుగా జ్వరం రావడం ముక్కు, చిగుళ్ళ నుంచి రక్తం రావడం, మెడ, చంకల్లోని లింఫ్ గ్లాండ్‌లలో వాపు రావడం, తరచూ తలనొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఎలా తెలుస్తుంది?

శరీరంలోని ఏ భాగం నుంచి అయినా చాలా రోజులుగా చీము గాని, మరేదైనా ద్రవాలు రావడం, ఏ భాగంలో అయిన గడ్డ కనిపించి అది క్రమంగా పెరుగుతూ వుండడం, వేగంగా బరువు తగ్గడం, మింగేటప్పుడు గొంతు పట్టేసినట్లు వుండడం, 15 రోజులకు పైగా గొంతు బొంగురుపోయి అలాగే ఉండడం, పులిపిరి కాయలు, పుట్టుమచ్చల్లో ఏదైనా మార్పు కనిపించడం వంటవి వచ్చినప్పుడు క్యాన్సర్ ఏమోనని అనుమానించాలి. అలాగే మలంలో, మూత్రంలో తరచూ రక్తం పడుతున్నా, స్త్రీలలో అధిక రక్తస్రావం కావడం దుర్వాసనతో తెల్లబట్ట కావడం వంటివి కనిపించినప్పుడు వెంటనే డాక్టర్‌ని సంప్రదించి అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలన్నీ చేయించాలి. అల్ట్రాసౌండ్ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, సిబిపి, ఇఎస్ఆర్, సిటి స్కాన్, బయాప్సి, బోన్ మ్యారో టెస్ట్, పెట్‌స్కాన్ వంటి పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ సాధ్యమవుతుంది.

హోమియో చికిత్స

వ్యాధి శరీరంలోని ఏ భాగానికి వచ్చినా దాని మూల కారణాన్ని గుర్తించి చికిత్స చేయడం హోమియో ప్రత్యేకత. చాలా కేసుల్లో శస్త్ర చికిత్స లేకుండానే హోమియో విధానంతో నయం చేసే వీలుంది. క్యాన్సర్‌కు సరియైన రీతిలో వైద్యం చేస్తే ఎలాంటి దుష్ఫలితాలూ లేకుండా రోగి జీవిత కాలాన్ని పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. క్యాన్సర్ రావడానికి గల అసలు కారణాలు కనుక్కుని, వ్యాధి గమనాన్ని, దాని తీవ్రత, రోగి పరిస్థితి అన్నీ పరిగణలోకి తీసుకుని చికిత్స చేస్తే రోగి క్యాన్సర్ నుంచి విముక్తి పొందే అవకాశాలు చాలా ఎక్కువ.

*



ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసే డార్విన్ జీవితచరిత్ర

విజ్ఞాన విప్లవదీప్తి చార్లెస్ డార్విన్, మూలం: ఆర్.పెరియస్వామి, అనువాదం: ఎ.జి.యతిరాజులు, పేజీలు: 96, వెల: రూ. 60. ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

మన బతుకు నడకకు తోడ్పడే అరుదయిన పుస్తకాల కోవలో చెప్పుకోదగ్గ గ్రంథం చార్లెస్ డార్విన్. ఆయన జీవితం అత్యంత ఆసక్తికరం, స్ఫూర్తిదాయకం. ఇది వ్యక్తిత్వవికాసానికి ఉపకరించే కరదీపిక. డార్విన్ గురించి రచించిన ఆర్.పెరియాస్వామి పుస్తకాన్ని ఎ.జి.యతిరాజులు 'విజ్ఞాన విప్లవదీప్తి చార్లెస్ డార్విన్' శీర్షికన అనువాదం చేశారు. జీవపరిణామాభివృద్ధి సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించిన చార్లెస్ డార్విన్ జీవితం గురించి తెలుసుకుంటే ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి. మానవ పరిణామ వికాసాన్ని అర్థం చేసుకోడానికి డార్విన్ చేసిన కృషి ప్రపంచంలో హేతుదృష్టి విస్తరించడానికి దోహదం చేసింది. 19వ శతాబ్దానికి చెందిన డార్విన్‌కు కారల్‌మార్క్స్‌కు కూడా మంచి సంబంధాలున్నాయి. డార్విన్ కనుగొన్న జీవ పరిణామ సిద్ధాంతం, మార్క్స్ సృజించిన మానవ సమాజచరిత్ర పరిణామ సిద్ధాంతం ప్రపంచ గమనాన్ని మార్చివేశాయి. అందువల్లనే డార్విన్‌ను, మార్క్స్‌ను ప్రతితరం పాఠకులు చదవాలి.

డార్విన్ గురించి సులభమైన శైలిలో రాసిన పుస్తకంలో ఎనిమిది అధ్యాయాలున్నాయి. డార్విన్ కుటుంబ నేపథ్యం, 'బీగిల్' నౌకా ప్రస్థానం, డార్విన్-ఎమ్మాల వైవాహిక జీవితం, మహత్తర మార్పులు తీసుకొచ్చిన డార్విన్ గ్రంథాలు ఎంతో ఆసక్తికరంగా వున్నాయి. జీవ పరిణామ సిద్ధాంతం కనుగొన్న డార్విన్ కూడా తన జీవితంలో ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నారు. వాటిని అధిగమిస్తూ తనకు నచ్చిన రంగంలో కృషి చేశారు. ఆయన పరిశోధనల, రచించిన పుస్తకాల గురించి రేఖామాత్ర పరిచయం ఈ పుస్తకంలో వుంది. ఈ పుస్తకం చదివాక డార్విన్ గురించి మరింతగా తెలుసుకోవాలనిపిస్తుంది. జీవితం పట్ల మన దృష్టిపథం మారుతుంది. ఆత్మవిశ్వాసంతో మెలిగే గుణం అలవడుతుంది. అందుకే డార్విన్‌ను చదవాలి.

ఆత్మగౌరవ చరిత్రకు ప్రతిఫలనం



మాదిగవారి చరిత్ర-రెండవభాగం, రచన: తాళ్లూరి లాబన్‌బాబు, పేజీలు: 196, వెల:150/-, ప్రతులకు:విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

అస్తిత్వవాద ఉద్యమాల నేపథ్యంలో దళిత చైతన్యం విస్తరించింది. ప్రతి కులం తన మూలాలకు వెళ్ళి చరిత్రను పునర్మూల్యాంకనం చేస్తోంది. ఇలాంటి పూర్వరంగంలోంచి చూస్తే తాళ్లూరి లాబన్‌బాబు రచించిన 'మాదిగవారి చరిత్ర'కు ఎంతో ప్రాధాన్యముంది. గతంలో మొదటిభాగం విడుదల చేశారు. ఇప్పుడు రెండోభాగం వచ్చింది. మాదిగవారి చరిత్రను కూలంకషంగా చర్చించారు లాబన్‌బాబు. ఈ రెండో భాగంలో ఇరవై అధ్యాయాలున్నాయి. మూలాలని తరచి చూసి విశ్లేషించిన పద్ధతి సహేతుకంగా వుంది.

వర్ణం అనగానేమి? శూద్రులు ఎవరు? అస్పృశ్యులు ఎవరు? అనే మౌలిక ప్రశ్నలే చర్చిస్తూ సంత్ రవిదాస్‌నీ, కులపురాణాలు, పటం కథలు, జాంబవపురాణం, అమరావతి రాజ్యంలో మాదిగ సర్దారుల గు రించి ప్రస్తావించారు. అనేక విషయాల్ని వివరిస్తూ, విభిన్నకోణాల్నించి విశ్లేషిస్తూ చివరగా దళిత సాహిత్యంలో మాదిగవారి పాత్రను, దళిత సాధికారతలో మాదిగవారి పాత్ర గురించి చర్చించారు. ఒక కులం పరిణామాన్ని, క్రమవికాస చరిత్రను పద్ధతిగా రాయడంలో లాబన్‌బాబు చేసిన కృషి విశేషమైంది. చివరి అధ్యాయంలో స్ఫూర్తిప్రదాతలు అంటూ మాదిగల కోసం కృషి చేసిన ప్రముఖుల్ని స్మరించుకున్నారు. ఈ పుస్తకరచన కోసం రచయిత ఎంతో అధ్యయనం, పరిశోధన చేశారు. చివరతో తాను అధ్యయనం చేసిన పుస్తకాల జాబితా ఇవ్వడం బావుంది. జీవితంలోని వైశాల్యాన్ని అనుభవంలోకి తెచ్చుకునేందుకు దళితులు ఎంతగా శ్రమించాల్సి వస్తుందో వివరించిన తీరు ఆకట్టుకుంటుంది. ఆత్మగౌరవం కోసం పోరాడేవారి చరిత్రను ప్రతిఫలించే పుస్తకమిది.

- అశోక్‌కుమార్



సుజనులకు అక్షర సత్యాలు

సుజనులారా!, కవి : పి.ఎన్.మూర్తి, పేజీలు : 36, వెల : 30/-, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ విక్రయ కేంద్రాలు

'సుజనులారా!' అనే మకుటంతో శతక సాంప్రదాయం పాటిస్తూ (నాల్గు లైన్లు) సామాజిక అంశాల్తో ఈ కవితలు రాశారు. ఆటవెలదుల్లా, వేమన పద్యాల్లా గోచరిస్తాయి. ఇందులో భాష, పదాలు... గ్రాంధికంగా కనిపించినా అచ్చ తెలుగు కవితలవి. కవి పి.ఎన్.మూర్తి వసుధా పాటల రచయిత కావడం వల్ల కొన్ని కవితలు గాన యోగ్యంగా వున్నాయి. కొన్ని చైతన్య స్ఫోరకంగా వున్నాయి.

ఈ సంఘంలో మార్పు రా(కా)వాలనే సంకల్పం ప్రతి పంక్తిలో కనిపిస్తుంది. ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు అన్నట్లుగా వామపక్ష దృక్పథం కనిపిస్తుంది కొన్నింటిలో.

"బద్దెన వేమన భాస్కర శతకముల్/ బహు చక్కగ చదివితి మిక్కిలి మక్కువ/ తోడ, నేనీ కవితా మాలికలల్లితి, గ్రుక్కున/ మీ అక్కున చేర్చుకొనుట 'సుజనులారా!" అంటాడు ఈ కవి.

'అక్షర సత్యాలు - జన చైతన్య నేత్రాలు మూర్తి గారి పద్యాలు' అంటూ ప్రముఖ కవి బిక్కి కృష్ణ చక్కటి ముందుమాట రాశారు. తెలుగు సాహిత్యంలో శతక సాహిత్యానికి ఒక ప్రత్యేకత వుంది. బాల్యం నుండి పిల్లలకి ఇంట్లో పెద్దవాళ్ళో, బడిలో పాఠ్యాంశ గ్రంథాల్లోనో... వేమన, సుమతి, బద్దెన, దాశరథి, శేషప్ప కవుల పద్యాలు మననం చేసుకుని వుండే వుంటారు. వేమన శతకాలు నేటికీ ఆణి ముత్యాలే కదా!!

మూర్తిగారి కలం చాలా బలంగా, బోఫోర్స్ కుంభకోణాల నుండి 2జి స్పెక్ట్రమ్ దాకా, యూరియా స్కామ్ నుండి (బీహార్) గడ్డి స్కామ్‌ల దాకా ఛలోక్తులు వ్యంగ్యాస్త్రాలు కవితాత్మకంగా అక్షర శరాల్తో సంధించి వదిలారు.

పి.వి.నరసింహారావు ఆర్థిక, సరళీకరణ, గరళీకరణమై సామాన్యుల్ని కాల్చుకు తినేవైనాన్ని స్వచ్ఛ భారత్‌వైపు ప్రజల్ని దృష్టి మళ్ళించి, ఈ దేశ సంపదను, బడా కంపెనీలకు, కార్పొరేట్ దిగ్గజాలకు కట్టబెట్టే మోడీయిజాన్ని... సత్యం సుజనునాలా అంటూ కవి పి.ఎన్.మూర్తి శతకంలో సామాజికాంశాల్ని చొప్పించిన తీరు ప్రశంసనీయం.

- తంగిరాల చక్రవర్తి, 9393804472



ప్రయోజనం చేకూర్చే 'డిటిపి'

డి.టి.పి. మేడ్ ఈజీ, డా॥కె.కిరణ్‌కుమార్, వెల : 150/-, పేజీలు : 234, ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

ఉపాధి అవకాశాల కల్పనకు అవసరమైన సృజనాత్మక అర్హతల్లో పేజి మేకర్, ఫొటోషాప్, కొరేల్‌డ్రా అనేవి నేడు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఆధునిక యువత అవసరాలకు అనుగుణంగా ఈ డిటిపి కోర్సులను అందిస్తన్న సంస్థలు కూడా అనేకం పుట్టుకొస్తున్నాయి. అంటే ఆదాయం చేకూర్చడంలోనూ, అవి నేర్చుకునే యువతలో నైపుణ్యాన్ని పెంపొందించడంలోనూ సంబంధిత కోర్సులు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. అలాంటి ప్రయోజనం చేకూర్చే ఈ మూడు కోర్సులనూ సులువుగా అర్థమయ్యేలా " డిటిపి –మేడ్ ఈజీ" అనే ఒకే పుస్తక రూపంలో అందరికీ అందుబాటులోకి తెచ్చారు రచయిత డాక్టర్ కె. కిరణ్ కుమార్. ఆర్నెల్లో, ఏడాదో నేర్చుకుంటే గానీ పూర్తిగా అర్థం చేసుకోలేని అనేక అంశాలను కేవలం చదవడం ద్వారా మాత్రమే నేర్చుకునే తీరుగా, ఎంతో సృజనాత్మకంగా పొందుపర్చారు. ఈ పుస్తకంలో మొత్తం మూడు భాగాలున్నాయి. మొదటి భాగమైన పేజీ మేకర్‌లో తొమ్మిది పాఠ్యాంశాలున్నాయి. పేజీ మేకర్‌కు సంబంధించిన 'ఐకాన్స్' వాటి పేర్లు, పని తీరు, ఉపయోగించే విధానం, ఏ టూల్‌ను ఎలా ఉపయోగించాలి? ఏ సందర్భంలో ఉపయోగించాలి? పేజీలోకి సమాచారం ఎలా తీసుకోవాలి? ఎడిట్ చేసే విధానం, అవసరమైన డిజైన్‌లోకి సమాచారాన్ని మార్చే తీరు వంటి అనేక అంశాలను పేర్కొన్నారు. రెండో భాగమైన ఫొటోషాప్‌లో ఎనిమిది పాఠ్యాంశాలున్నాయి. వీటిలో ఫొటోషాప్ టూల్సు, వాటి ప్రయోజనం గురించి వివరించారు. మూడవ భాగమైన కొరేల్ డ్రాలో నాలుగు పాఠ్యాంశాలతో పాటు, ఇందులో మరో భాగంగా 'ప్రాక్టికల్ ప్రాజెక్ట్స్' ను కూడా ఇచ్చారు. ఇందులో ప్రవేశించడం మొదలు చివరిదాకా ఏ టూల్సును ఎలా ఉపయోగించాలో, దేనివల్ల ఎలాంటి ప్రయోజనమో తెలిపారు. ఇలా పుస్తకం మొత్తంలోని మూడు విభాగాల్లోనూ దేని ప్రాధాన్యతను దానిలో చక్కగా పేర్చడంలో, బొమ్మలతో సహా వివరించడంలో, విశ్లేషించడంలో రచయిత ప్రదర్శించిన సృజనాత్మకత, సులువుగా అర్థమయ్యే ఆంగ్ల భాషా శైలి చాలా బాగుంది. ఆంగ్లం చదవడం వచ్చిన తెలుగు మీడియం విద్యార్థులు కూడా ఈ పుస్తకాన్ని చదివి డిటిపి నేర్చుకునేలా ఉంది. పేజిమేకర్, ఫొటోషాప్, కొరేల్‌డ్రా పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పుస్తకం ఉపయోగకరం.

– అజాద్



బహుమతిగా ఇవ్వదగిన పుస్తకం

తెలంగాణ ఇంటి వంటలు, జ్యోతి వలబోజు, వెల : 150/-, పేజీలు : 256, ప్రతులకు : నవోదయ- 04024652387, తెలుగు బుక్ హౌస్-9247446497, ప్రజాశక్తి బుక్‌హౌస్-04027660013

రోజూ తినే పదార్థాలేనా కాస్త వెరైటీగా, నోటికి రుచిగా వుంటే ఎంత బాగుంటుంది? అనుకునేవారికి ఈ పుస్తకం వరం లాంటిది. జ్యోతి వలబోజు దాదాపు సంవత్సరం పాటు శోధన చేసి తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో వండుకునే రకరకాల మాంసాహార వంటకాలను 'తెలంగాణ ఇంటి వంటలు' పేరుతో పుస్తక రూపంలో తీసుకొచ్చారు. ఇందులోని వంటకాలు చూస్తే మాంసాహారంలో కూడా ఇన్ని రకాలున్నాయా అని ఆశ్చర్యపోతారు. సుమారు 200 రకాలకు పైనే నాన్‌వెజ్ వంటకాలు ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఒక్క కోడిగుడ్డుతోనే 22 రకాల వంటలు ఉన్నాయంటే, మిగతా మాంసాహారాల గురించి ఊహించుకోండి. చదువుల కోసమో, ఉద్యోగాల కోసమో ఇంటికి, అమ్మకు దూరంగా వుండే యువతకు(ఇప్పుడు అమ్మాయిలు, అబ్బాయిలు అందరూ వండుకుంటున్నారు), లేదా కొత్తగా పెళ్లయి అత్తారింటికి వెళ్లే అమ్మాయిలకు అన్నీ వండడం రాదు. ఈ పుస్తకం దగ్గరుంటే చాలా సులభంగా ఎలాంటి నాన్‌వెజ్ వంటకాన్నైనా వండేయొచ్చు. తయారు చేసే పద్ధతి చాలా విపులంగా, తేలిక పద్ధతిలో వివరించారు జ్యోతి. పుస్తకం చివర్లో పండుగలకు, ప్రత్యేక సందర్భాల్లో సంప్రదాయంగా తయారు చేసే వంటల గురించి వివరించారు. పదార్థాల పేర్లు, వస్తువుల పేర్లు ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. చదివేవారికి తెలియని పేర్లతో ఇబ్బంది కలగకుండా పుస్తకం చివర్లో పదకోశం శీర్షికన కొన్ని పదాలు, వస్తువులకు పర్యాయపదాలు కూడా ఇవ్వడం బాగుంది. నిస్సందేహంగా ఇది ఎవరికైనా బహుమతిగా ఇవ్వదగిన పుస్తకం.

– అఖిల

నాకు నచ్చిన పుస్తకం

తప్త శిల

అమ్మంటే ప్రేమ సంవేదనల కలయిక అంటూ తల్లి గొప్పతనాన్ని చిత్రించే భవానీగారి కలం నుండి వెలువడిన ఈ కథలన్నింటిలోనూ ఏక రూపంగా సాక్షాత్కరించేది గొప్ప మానవీయ భావన. ఒక ఉద్యోగిని ఇంట్లో చూసేవారు లేక ప్రమాదవశాత్తూ పసి బిడ్డను కోల్పోయి తప్తశిలలా బతుకుతూ వుంటుంది. ఈ కథలో ఉద్యోగస్తురాలైన స్త్రీలు పిల్ల పెంపకం విషయంలో పడే బాధను చక్కగా చిత్రీకరించారు. ఈమె కథల్లో పెద్ద పెద్ద మహళ్లు కట్టుకుని తల్లిని వృద్ధాశ్రమంలో పెట్టే కొడుకులూ, ఆమె చనిపోయాక పశ్చాత్తాప పడే కొడుకులూ కనబడి మనల్ని కదిలిస్తారు.

తనకు నచ్చిన హిందీ కథల్ని అనువాదం చేసి తన విశాల హృదయాన్ని చాటుకున్నారు భవానీ. 'స్పర్శకాటు' అనే అనువాద కథలో ఒక బాల వేశ్యలో తన కూతురి వయసున్న అమ్మాయిని చూసి చలించిన ఒక పురుషుడి కథ మన మనసును సూటిగా తాకుతుంది. అలాగే సింగిల్ చైల్డ్‌ని తల్లిదండ్రుల బిజీ జీవితాలు ఎలాంటి స్థితికి వెడతాయో 'శశి ఉప్పల్' గారి కథ అనువదించి చెప్పారు భవానీ.

గొప్ప జీవితానందం కోసం ఒకరి కోసం మరొకరు చిన్న చిన్న త్యాగాలు చేసుకునే దంపతులూ, తొందరపడి విడాకులు తీసుకుని పశ్చాత్తాప పడే దంపతులూ మనకు భవానీ గారి కథల్లో కనబడి మనల్ని చిన్నగా కుదుపుతారు. భగవంతుడిని తన తోడుగా నిలుపుకున్న స్త్రీ కథ 'భావములోన' చాలా మంచి కథ.

ప్రేమ పూరిత సమాజం కోసం, మనుషుల మధ్య సామరస్యం కోసం తపన పడి ఆర్తితో రాసిన కథలివి. చదివిన వారి ఆలోచనా పరిధిని పెంచేటట్టుగా రాసిన భవానీదేవిగారు ఒక నిబద్ధత గల రచయిత. అందరూ తప్పక చదవవలసిన కథల సంపుటి ఇది.

– అల్లూరి గౌరీలక్ష్మి

■ ఈ వారం కవిత్వం

కామాటిపుర

రాత్రిపూట సంచరించే ముళ్ళపంది
ఇక్కడ సేద దీర్చుకుంటుంది
ఆకర్షించే పూల బంతిలాగా
శతాబ్దాల సుఖరోగాల్ని తొడుక్కుని
కేలండర్‌ను పక్కకు తోసేసి
తన కలల్లో తాను ఎల్లప్పుడూ మునిగిపోయి ఉంటుంది
నిశ్శబ్దానికి నిశ్శబ్దానికీ మధ్య ఖాళీలో
మనిషి మాట కోల్పోయాడు
కావాలంటే నీ ఇనుప నేత్రాన్ని కాపలా పెట్టు
అందులో కన్నీరు గనక వుంటే
ఫ్రీజ్ చెయ్యి, భద్రపరుచు, కాపాడు
ముళ్ళపంది ఒక్క ఉదుటున లేస్తుంది
పదునైన ముళ్ళతో నీ మీద పడి దాడి చేస్తుంది
రాత్రి, తన వరుణ్ణి వెతుక్కుంటున్న సమయంలో
గాయాలు పుష్పిస్తాయి
అంతం లేని పువ్వుల సముద్రాలు చుట్టుకొస్తాయి
నెమళ్ళు నాట్యమాడుతాయి – జత కడతాయి
ఇది నరకం – ఇదొక వికారపు ఆగ్రహం
ఇది నృత్యకారుల కాలి అందెల్లాంటి తల్లడిల్లే బాధ
చర్మాన్ని వదిలేసుకో, దాన్ని అంతర్ త్వచాన్నుంచి తీసేసుకో
ఇవి నిరంతరం కొనసాగే విషపూరిత గర్భాలు
ఈ పొటాషియం సయనైడ్ రుచి చూడండి
క్షణ మాత్రాన మీరు మరణిస్తారు
ఈ విషపు తియ్యని ఉప్పు వాసన కోసం ఇక్కడ 'క్యూ' కట్టారు
పదాల్లాగా ఇక్కడ చావు గుమి గూడింది
ఇక ఒకే ఒక్క నిమిషంలో అది గుమ్మరించడం ప్రారంభిస్తుంది.

కామాటిపుర!
నీ మోచేతి కింద అన్ని రుతువుల్ని అదిమిపెట్టి
ఇక్కడ నువ్వు బురద చిమ్ముతావా?
నేను మాత్రం అన్ని సంతోషాలకు, బాధలకు ఆవల ఉండి
నీ పద్మం వికసించాలని ఎదురు చూస్తాను!
బురదలో ఒక పద్మం –

మరాఠీ కవి, రచయిత నామ్‌దేవ్ ధసాల్, దళిత్ పాంథర్స్, ఉద్యమాన్ని ప్రారంభించినవాడు. దళిత శబ్దానికి నిర్వచనం మార్చి జీవితాంతం ప్రజా హక్కుల కోసం పోరాడిన యోధుడు. గోల్‌పీఠా, కామాటిపుర వంటి ముంబై మురికి వాడల్లో పెరిగిన ధసాల్, టాక్సీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ సోషలిస్ట్ భావాలకు ఆకర్షితుడయ్యాడు. కేంద్ర సాహిత్య అకాడెమీ నుండి ప్రత్యేకంగా 'గోల్డెన్ లైఫ్ టైమ్ ఎఛీవ్‌మెంట్'ను, భారత ప్రభుత్వం నుండి 'పద్మశ్రీ'ని స్వీకరించాడు. ఈయన ప్రారంభించిన దళితోద్యమ ప్రభావం అన్ని భారతీయ సాహిత్యాల పైన పడింది. పొయెట్ ఆఫ్ ద అండర్ వరల్డ్‌గా ప్రసిద్ధుడు. 'కామాటిపుర' ముంబైలో వేశ్యలుండే మురికివాడ. ఈ కవి అక్కడ జీవించినవాడే! ఆ జీవిత నేపథ్యమే అతణ్ణి ఉద్యమాల వైపు నడిపించింది.

ఈ కవితలో అగ్రవర్ణ, సంప్రదాయ, భావజాలానికి సంకేతంగా ఈ కవి ముళ్ళపందిని తీసుకున్నాడు. అది దాడి చేయడం, గాయాలు పుష్పించడం వంటి వాక్యాలు ఆ నేపథ్యాన్ని వర్ణించినవే! తన అరవై అయిదవ యేట గత సంవత్సరం నామ్‌దేవ్ లక్ష్మణ్ ధసాల్ 15 జనవరి 2014న ముంబైలో అంతిమ శ్వాస విడిచాడు.

అనువాదం, పరిచయం : డాక్టర్ దేవరాజు మహారాజు, 9908633949

ముందడుగు

రాజ్యాధికారం, రాజ్యం
రెండూ
జీవితంలో వెన్నెల కానప్పుడు
ధ్వంసం చేయదగిన వస్తువులేనని
జనం అడుగులేస్తారు
ప్రజలకు
ధ్వంసం, విధ్వంసం, నిర్మాణం
అన్న ఒక్కటే
అన్నీ వారి చేతులలో పనిముట్లే –
ఎంత కాలం సహనం

తాము వెలిగించిన దీపాన్ని
రాజ్యం ఆరిపేస్తున్నప్పుడు
తాను రగిలించిన మంటను
రాజ్యం ముంచేస్తున్నప్పుడు
అమావాస్య లోతునను వేటాడడం
జనం కర్తవ్యం
ఇక్కడ
జనానికి యుద్ధం తప్పడం లేదు
యుద్ధం ఎప్పుడైనా
ఆయుధాల వాహారమే
ఇక్కడ
హింస అనివార్యమైన అడుగుమాత్రమే

– సిహెచ్.మధు, 9949486122

క్యూబిక్ ఇళ్ళు



ఇల్లు ఏ మూలైనా కాస్త వంకరగా, గోడలు క్రాస్‌గా వున్నా చాలామంది ఇష్టపడరు. అయితే ఈ ఇళ్ళు చూడండి... ప్రత్యేకమైన క్యూబ్ ఆకారంతో 45 డిగ్రీల ఒంపుతో వున్నాయి. ఇవి నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్, హెల్మాండ్ అనే ప్రదేశాల్లో వున్నాయి. ఇక్కడున్న 38 ఇళ్ళూ ఇదే ఆకారంలో ఒకదానికి ఒకటి అంటుకుని ఉంటాయి. ప్రతి ఇల్లూ రెండు అంతస్తులతో... త్రికోణాకారంలోని మొదటి అంతస్తులో హాలు, వంటగది, రెండో అంతస్తులో పడక గదులు, బాత్రూం, ఆపైన ఇష్టమైన వాళ్లు మరో బెడ్రూమ్‌గానో, స్టడీ రూం గానో ఏర్పాటు చేసుకున్నారు. ఇంటి స్థలం మొత్తం వంద మీటర్లయితే అందులో పావువంతు వాలుగా వున్న గోడల వల్ల నిరుపయోగంగానే వుంటుంది. వీటిని రూపకల్పన చేసింది పియెట్ బ్లామ్ అనే ఆర్కిటెక్చర్. ఇళ్ళు ఇలా కట్టాలన్న ఆలోచన ఈయనకి 1970లోనే వచ్చిందట. కాకపోతే దాన్ని అమలు చేయడానికి 14 ఏళ్ళు పట్టింది. లోపల ఉండే వారికి ఎలా వుంటుందో తెలియదు కానీ చూడ్డానికి మాత్రం చుట్టూ మామూలు ఇళ్ళ మధ్య ఇవి ఆకర్షణీయంగా ఉన్నాయి.

వృద్ధ పిల్లలు

వృద్ధ పిల్లలేంటా అనుకుంటున్నారా? ఇక్కడున్న చిన్నారులను చూస్తేనే అర్థమవుతుంది కదా, ఇలా ఎందుకంటున్నామో! కాలిఫోర్నియాకు చెందిన జాచరీ స్కాట్ అనే ఫొటోగ్రాఫర్ ఆరుగురు పిల్లలతో ఇలా అమ్మమ్మ, తాతయ్య పాత్రలు వేయించాడు. చిన్నారులతో ఈ స్టిల్స్ తీయడానికి చాలా శ్రమ పడాల్సి వచ్చిందట. బుజ్జి బుజ్జి అమ్మమ్మ, తాతయ్యలు బాగున్నారు కదూ!